V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
17-01-2026
సంపుటి : 01 | సంచిక : 186 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

డా॥ కాచం సత్యనారాయణ
CMD

### భూ భారతి కేసులో
## 15 మంది అరెస్ట్

- వెలుగులోకి ధరణి-భూభారతి కుంభకోణం
- నాలుగు కోట్ల ఆదాయానికి గండి
- యాదగిరిగుట్ట కేంద్రంగా ఆన్‌లైన్ మోసాలు

2




### హైదరాబాదులో
## ఫ్లైఓవర్ల మూసివేత..!!

- ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణలు అమలు
- నెక్లెస్ రోడ్ కూడా మూసివేత
- పాతబస్తీలోని పురానాపూల్‌లో మత ఘర్షణల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం

2





# నిధుల కోసమే హస్తిన టూర్లు

### ఆదిలాబాద్‌కు 'పాలమూరు' దన్ను
### ఎయిర్‌పోర్టు, యూనివర్సిటీ హామీలు

- ఆదిలాబాద్ జిల్లాపై సీఎం రేవంత్ వరాల జల్లు
- కేసీఆర్ సలహాలు ఇవ్వాల్సింది పోయి విమర్శిస్తున్నారు
- రాష్ట్ర అభివృద్ధి కోసమే మోదీని కలుస్తున్నాను : రేవంత్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేక అభిమానం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్మల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. జిల్లాకు యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, ఎయిర్‌పోర్టు వంటి మెగా ప్రాజెక్టులను ప్రకటించారు. గత పదేళ్ల పాలకుల నిర్లక్ష్యం వల్ల అన్యాయానికి గురైన ఈ పోరాట గడ్డను, పాలమూరు జిల్లాతో సమానంగా అభివృద్ధి చేసి తీరుతామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**సీఎం ప్రకటించిన కీలక హామీలు**

ఎర్రబస్సు రావడమే కష్టమైన ప్రాంతానికి ఎయిర్‌పోర్టును తీసుకొచ్చి, స్వయంగా ప్రధాని మోదీతో ప్రారంభిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌కు ప్రత్యేక యూనివర్సిటీతో పాటు, నిర్మల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. చనాకాకొరాటా ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని తెలిపారు. బడ్జెట్ సమావేశాలలోపే తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రతి ఎకరానికి నీరందిస్తామని తెలిపారు. ఆదిలాబాద్‌లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**కేసీఆర్ సలహాలు ఇవ్వాల్సింది పోయి విమర్శిస్తున్నారు.**

కేసీఆర్ 40 ఏళ్ల రాజకీయ అనుభవం అభివృద్ధికి ఉపయోగపడటం లేదని సీఎం ఎద్దేవా చేశారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తే ప్రజలు రాజకీయ సమాధి కడతారని హెచ్చరించారు. ఒక్క పంచ్‌తో కేసీఆర్‌ను ప్రజలు ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశారన్నారు. ఇక వారి గురించి మాట్లాడి సమయం వృధా చేయనని తెలిపారు. 2034 వరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

**అమలవుతున్న గ్యారెంటీలు**

గత ప్రభుత్వం చేసిన అప్పుల చిక్కుముడులను విప్పుకుంటూనే ప్రజా సంక్షేమ పథకాలను పరుగులు తీయిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, సన్నవడ్లకు రూ.500 బోనస్, రైతులకు భరోసా పథకాలు అమలు చేస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. మేడారం జాతర కోసం అద్భుతమైన ఆలయాల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు.

**ఢిల్లీ పర్యటనలపై క్లారిటీ**

ప్రధాని మోదీని పదే పదే కలుస్తున్నారన్న విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. తనకు వ్యక్తిగత ఎజెండా లేదని.. పైరవీలు చేయాల్సిన అవసరం అంతకన్నా లేదన్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రావాలంటే ప్రధానిని, కేంద్ర మంత్రులను కలవాల్సిందేనని తెలిపారు. అడగనిదే అమ్మ కూడా పెట్టదని.. అందుకే ప్రతిసారి వెళ్లి రాష్ట్ర పరిస్థితిని ప్రధానికి వివరిస్తున్నానని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అడగడం.. మిగతా2లో...

# మేడారంలో తెలంగాణ కేబినెట్

- మేడారంలో 18న క్యాబినెట్ సమావేశం
- గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై రేవంత్ సర్కార్ ఫోకస్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర పరిపాలన చరిత్రలో ఒక అరుదైన, చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. సాధారణంగా భాగ్యనగరంలోని సచివాలయానికే పరిమితమయ్యే రాష్ట్ర మంత్రివర్గ సమావేశం.. ఈసారి రాజధానికి దూరంగా, కోట్లాది మంది భక్తుల ఆరాధ్యదైవం.. మేడారం సమ్మక్కసారలమ్మ క్షేత్రంలో జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ సాహసోపేత నిర్ణయం తీసుకుంది.

18న సాయంత్రం 5 గంటలకు ములుగు జిల్లా మేడారంలోని హరిత హోటల్ ఈ కీలక భేటీకి వేదిక కానుంది.

ఇందుకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావు ఇప్పటికే అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. పాలనను ప్రజల వద్దకు, ముఖ్యంగా వెనుకబడిన గిరిజన ప్రాంతాలకు తీసుకెళ్లాలనే సంకల్పంతోనే ఈ నిర్ణయం.. మిగతా2లో...



### టీఎస్ ఐపాస్‌కు నీతి ఆయోగ్ ప్రశంసలు
# తెలంగాణకే గర్వకారణం

- కేసీఆర్ దూరదృష్టికి, పాలనా నైపుణ్యానికి స్పష్టమైన గుర్తింపు
- పదేళ్ల వ్యవధిలోనే దేశానికి పారిశ్రామిక దిశానిర్దేశకంగా మార్చడంలో టీఎస్ ఐపాస్ కీలక పాత్ర
- రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి : కేటీఆర్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** టీఎస్ ఐపాస్ విధానానికి నీతి ఆయోగ్ నుంచి లభించిన ప్రశంసలు తెలంగాణకు గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రూపుదిద్దుకున్న ఈ విధానం దేశంలోనే అత్యుత్తమ పరిశ్రమల అనుమతి వ్యవస్థగా నీతి ఆయోగ్ తన తాజా నివేదికలో గుర్తించడం, తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమని ఆయన తెలిపారు. ఇది కేసీఆర్ దూరదృష్టికి, పాలనా నైపుణ్యానికి స్పష్టమైన గుర్తింపుగా నిలుస్తుందని అన్నారు... మిగతా2లో...



### భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా
# ఆలయాల అభివృద్ధి

- సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పర్యవేక్షణతో నిధులు
- వేములవాడ లో రాజన్న ఆలయ విస్తరణ, మేడారంలో సమ్మక్క సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం
- వేములవాడ భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, కోడె మొక్కులు చెల్లించిన మంత్రి సీతక్క

2



### నెతన్యాహుతో పుతిన్
# కీలక చర్చలు

- ఇరాన్ హింసపై
- మధ్యవర్తిత్వానికి సిద్ధమన్న పుతిన్



2

### ప్రాజెక్టుల క్రెడిట్
# కేసీఆర్ దే..

- 95 శాతం మా హయాంలోనే -కేటీఆర్

2



### మెట్రో ఫేజ్-2పై రేవంత్‌కు
# కిషన్ రెడ్డి లేఖ

- అధికారుల పేర్లు పంపించండి
- కిషన్ రెడ్డి విజ్ఞప్తి

2



# తిరుపతిలో అతిపెద్ద రీసెర్చ్ హబ్

- 'ఏపీ ఫస్ట్'కు సీఎం బాబు గ్రీన్ సిగ్నల్
- ఐఐటీ - ఐసర్‌ల భాగస్వామ్యంతో సరికొత్త ఆవిష్కరణలు
- యువత భవిష్యత్తుకు బాటలు వేయడమే లక్ష్యం



2

# నిజాం రాజు హంతకుడే..

ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు..!!



2

ప్రజా విశ్వంభర

# భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి



విశ్వంభర, వేములవాడ : భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిసారు.
ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకొని, భీమేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి, వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. రూ. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు.
అలాగే మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా.. రెండు వందల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసి.. రానున్న తరాలకు చరిత్ర తెలిసేలా పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు. ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీన మేడారం జాతర పనులను సీఎం, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తల్లులను దర్శించుకోవాలని కోరారు.
రూ.150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ..
రూ. 150 కోట్ల నిధులతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు సాగుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కలు చెల్లించుకునే ముందు వేములవాడ కు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు.

## తిరుపతిలో అతిపెద్ద రీసెర్చ్ హబ్

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్‌ను సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. తిరుపతి వేదికగా 'ఏపీ ఫస్ట్' (ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ) పేరుతో ఒక భారీ అంతర్జాతీయ స్థాయి పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలోని యువతలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారిని గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని చంద్రబాబు తెలిపారు.
ఈ రీసెర్చ్ సెంటర్ కేవలం ఒక కార్యాలయంలా కాకుండా, విజ్ఞాన గనిలా పనిచేయనుంది. దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీతిరుపతి, ఐసర్ భాగస్వామ్యంతో దీనిని నిర్మించనున్నారు. ఈ రీసెర్చ్ సెంటర్‌లో అత్యాధునిక సాంకేతికపై పరిశోధనలు చేయనున్నారు. కొత్త రకమైన స్టార్టప్‌లకు, ఆవిష్కరణలకు ఊతమివ్వనుంది. కేవలం పరిశోధనలే కాకుండా, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు నేర్పించనుంది.
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తు విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. తిరుపతిలో ఏర్పాటు చేయబోయే ఈ సెంటర్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉంటుంది. రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో మన యువతే దిక్సూచి కావాలి" అని వెల్లడించారు. ఈ కేంద్రం ఏర్పాటుతో చిత్తూరు జిల్లా ఆధ్యాత్మిక రాజధానిగానే కాకుండా, దక్షిణ భారతదేశపు 'నాలెడ్జ్ హబ్'గా కూడా అవతరించబోతోంది.

## నిజాం రాజు హంతకుడే..

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. దీంతో రాజకీయంగా వాతావరణం వేడెక్కింది. తాజాగా మీడియాతో మాట్లాడిన ఆయన.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్‌ను ఉద్దేశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. శ్రీరాముడికీ బీజేపీ సభ్యత్వం ఉందని చెబితే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. అనుమానం ఉంటే వెళ్లి చూసుకోండి అంటూ ఆయన వ్యాఖ్యానించారు.
అంతేకాదు.. నిజామాబాద్ నగరాన్ని ఇకపై ఇందూర్ గా పిలవాలని అర్వింద్ డిమాండ్ చేశారు. నిజాం ఒక హంతకుడని, అలాంటి వ్యక్తి పేరుతో నగరాన్ని కొనసాగించడం సరికాదని అన్నారు. ఇందూర్ అనే పేరు ఎలా ఏర్పడిందన్న విషయంపై చారిత్రక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిజామాబాద్ పేరును మార్చి ఇందూర్‌గా చేయాలంటూ తీర్మానం చేసి, ఏబీవీపీ నుంచి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపిస్తామని తెలిపారు. మత రాజకీయాలపై కూడా ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ముస్లింలంటే కాంగ్రెస్ అన్నట్లుగా మాట్లాడటం సరికాదని విమర్శించారు. పహల్గాం ఘటనను ప్రస్తావిస్తూ, అక్కడ హిందువులా ముస్లింలా అని గుర్తించి కాల్చిచంపిన ఉదంతాన్ని గుర్తు చేశారు. సమాజంలో కొంతమంది హిందువుల్లోనూ చెడు ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణ త్వరలోనే కాషాయమయం కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
బీజేపీ బలం ఎక్కడుందో తెలుసుకోవాలంటే కవితను అడిగితే చెబుతుందని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో సిరిసిల్లలో కూడా పార్టీ శక్తిని చూపిస్తామని చెప్పారు. ఇందూర్‌కు దమ్ముంటే రా అంటూ కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే మత ఘర్షణలు చోటు చేసుకున్నాయని అర్వింద్ ఆరోపించారు. చెన్నారెడ్డి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో అల్లర్లు కొనసాగాయని పేర్కొన్నారు. ఏసీపీ సత్తయ్య హత్య కేసులో నిందితులను బయటకు తీసుకొచ్చింది మజ్లిస్ పార్టీనేనని ఆరోపించారు. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, దీనికి బాధ్యత సీఎం రేవంత్ రెడ్డిదేనని విమర్శలు గుప్పించారు. నిజాంను గాడిద అన్నందుకే పెద్ద రాద్ధాంతం చేస్తున్నారని, కానీ చరిత్రలో నిజాం ఎప్పటికీ క్రూర పాలకుడిగానే మిగిలిపోతాడని అర్వింద్ వ్యాఖ్యానించారు. ఆయన పేరు వినగానే హిందువులకు గుర్తొచ్చేది ఆయన చేసిన మారణకాండేనని అన్నారు. అదే సమయంలో ముస్లింల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇళ్లు, రేషన్, ఉచిత వ్యాక్సినేషన్ అందించడంతో పాటు, ముస్లిం దేశాలకు కూడా టీకాలు పంపించిందని పేర్కొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా అయ్యప్పస్వామి మకరసంక్రాంతి ఉత్సవాలు

### అల్లా రామకృష్ణకు సన్మానం




**విశ్వంభర, నర్సీపట్నం :** నర్సీపట్నం పట్టణంలో అయ్యప్పస్వామి మకరసంక్రాంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా సేవా కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాల్లో విశేషంగా కృషి చేస్తున్న రామకృష్ణ కు ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాబు చేతులమీదుగా మెమెంటో అందుకున్నారు . చింతకాయల విజయబాబు మాట్లాడుతూ సమాజ హితం కోసం ముందుండి సేవ చేసే వ్యక్తులను గౌరవించడం ద్వారా యువతకు మంచి ప్రేరణ కలుగుతుందన్నారు. వ్యాపార రంగంలో విజయాన్ని సాధించడమే కాకుండా, సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న అల్లా రామకృష్ణ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. అల్లా రామకృష్ణ మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆశీస్సులతో ఈ గౌరవం లభించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. భవిష్యత్తులో కూడా నర్సీపట్నం ప్రాంత అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు.

## భూ భారతి కేసులో 15 మంది అరెస్ట్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర రెవెన్యూ శాఖలో సంచలనం సృష్టించిన 'భూ భారతి' కుంభకోణంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల సరిహద్దుల్లో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో ఇప్పటివరకు 15 మందిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసు వివరాలను వెల్లడించారు. భూ భారతి వెబ్‌సైట్‌లో ఉన్న కొన్ని సాంకేతిక లోపాలను నిందితులు తమకు అనుకూలంగా మార్చుకున్నారని చెప్పారు. తప్పుడు పద్ధతుల్లో లాగిన్ అయ్యి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలాన్లను పక్కదారి పట్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారని చెప్పారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు ఏకంగా రూ.3.90 కోట్ల గండి పడిందని సీపీ సన్ ప్రీత్ సింగ్ వివరించారు.

**నిందితుల నుంచి భారీగా రికవరీ**

పోలీసులు నిందితుల ఇళ్లపై దాడులు చేసి భారీ మొత్తంలో నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ. 63.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, నిందితుల బ్యాంకు ఖాతాల సీజ్ చేశామన్నారు. ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, కార్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసులో బసవరాజు, జెల్లా అనే వ్యక్తులను ప్రధాన నిందితులుగా గుర్తించారు. ప్రస్తుతం మరో 9 మంది నిందితులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. త్వరలోనే మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఇలాంటి సాంకేతిక నేరాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. ఈ కుంభకోణంలో ఇంకా ఎవరైనా ప్రభుత్వ అధికారులు లేదా కీలక వ్యక్తుల హస్తం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు.

## హైదరాబాదులో ఫ్లైఓవర్ల మూసివేత..!!


**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్‌లో ముస్లింలు పవిత్రంగా జరుపుకునే 'షబ్‌ఎమేరాజ్' సందర్భంగా నగరంలో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణలు అమలు లోకి వచ్చాయి. శుక్రవారం రాత్రి 10 గంటల తర్వాత నగరంలోని అన్ని ఫ్లైఓవర్లను తాత్కాలికంగా మూసివేస్తా మని పోలీసు శాఖ ప్రకటించింది.
రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణను క్రమబద్ధం చేయడానికి ఈ చర్య తీసుకున్నట్టు పేర్కొన్నారు. అలాగే హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న నెక్లెస్ రోడ్ కూడా మూసివేయనున్నారు. అయితే, గ్రీన్‌ల్యాండ్స్ ఫ్లైఓవర్, పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, లంగర్ హౌస్ ఫ్లైఓవర్‌లకు ఈ ఆంక్షలు వర్తించవు అని ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయెల్ డేవిస్ తెలిపారు. అవసరాన్ని బట్టి తెలంగాణ తల్లి, షేక్‌పేట్, బహదూర్‌పురా ఎక్స్ రోడ్ ఫ్లైఓవర్లను కూడా మూసివేయవచ్చని తెలిపారు. ప్రజలు ఈ మార్పులను గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి, పోలీసుల సూచనలకు అనుగుణంగా సహకరించాలి అని ఆయన విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626కు కాల్ చేయవచ్చని సూచన ఇచ్చారు.
ఇక మరోవైపు, ఇటీవల పాతబస్తీలోని పురానాపూల్‌లో జరిగిన మత ఘర్షణల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను మరింత కట్టుదిట్టంగా చేశారు. జనవరి 14న రాత్రి ఓ వ్యక్తి మైసమ్మ ఆలయంలోని ఫ్లెక్సీ, విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేశాడు. దీనికి ప్రతిగా సుమారు 300 మంది సమూహంగా సమీపంలోని 'చిల్లా'పై దాడికి దిగారు. ఈ ఘటనల నేపథ్యంలో పాతబస్తీ ప్రాంతంలోని సున్నితమైన ప్రదేశాల్లో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. ఆలయంలో విధ్వంసానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు, రెండు ఘటనలపైనా కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రాజెక్టుల క్రెడిట్ కేసీఆర్ దే



**విశ్వంభర, తెలంగాణ న్యూస్ :** రాష్ట్రంలో కీలకమైన అన్ని సాగునీటి ప్రాజెక్టుల ప్రారంభోత్సవం చర్చకు దారితీసింది. ఆదిలాబాద్ జిల్లా భోరాజ్ మండలం హాతీఘాట్ వద్ద చనాక కొరాట పంప్ హౌస్ ను, జగిత్యాల జిల్లాలోని సదర్‌మాట్ బ్యారేజ్ ను సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ. ఈ ప్రాజెక్టుల ఘనత తమ సర్కారుదేనని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పనులు కేసీఆర్ పాలనలోనే 95 శాతం పూర్తయ్యాయని, సెప్టెంబర్ 2023లోనే విజయవంతంగా ట్రయల్ రన్ కూడా నిర్వహించామని ఆయన చెప్పారు. 2016లో మహారాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న అంతర్రాష్ట్ర ఒప్పందం వల్లే ఈ ప్రాజెక్ట్ సాధ్యమైందని తెలిపారు. 0.98 టీఎంసీల సామర్థ్యం గల ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లోని 89 గ్రామాలకు చెందిన 51 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. సదర్‌మాట్ బ్యారేజ్‌తో మారనున్న తలరాత జగిత్యాల, నిర్మల్ జిల్లాల సరిహద్దుల్లో గోదావరిపై 1.58 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన సదర్‌మాట్ బ్యారేజ్ కూడా కేసీఆర్ హయాంలోనే 90 శాతం పూర్తి అయ్యిందన్నారు. దీని ద్వారా 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుందని తెలిపారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయ రంగం ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందని కేటీఆర్ చెప్పారు. నెర్రెలుబారిన తెలంగాణ నేలను దేశానికే ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. మా ప్రభుత్వం ప్రారంభించిన పనులు ఇప్పుడు ఫలాలను ఇస్తుండడం సంతోషదాయకమన్నారు.
మరో కోటిన్నర మంజూరు
పర్యటనలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించిన ప్రభుత్వం పంచలింగాల నుంచి ఆలయం వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.50 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీనివల్ల స్థానికులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది.

## నెతన్యాహుతో పుతిన్ కీలక చర్చలు



**విశ్వంభర బ్యూరో:** ఇరాన్‌లో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య జరిగిన ఫోన్ కాల్ సంభాషణలు అంతర్జాతీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరాన్ లో సాగుతున్న అంతర్గత అల్లర్లు, ఆ దేశంతో నెలకొన్న ఉద్రిక్తతలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు అంతర్జాతీయ మీడియా చెబుతున్నది. ఇరాన్‌తో ఉన్న వివాదాలను పరిష్కరించేందుకు, అవసరమైతే తాము మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నామని నెతన్యాహుకు పుతిన్ హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను పునరుద్ధరించడానికి రష్యా తరపున దౌత్యపరమైన అన్ని ప్రయత్నాలూ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌లో ఉద్రిక్తతలు తగ్గడం ప్రపంచ శాంతికి కీలకమని పుతిన్ అభిప్రాయపడ్డారు. రక్తసిక్తమవుతున్న ఇరాన్ వీధులు ఒక వైపు, మరోవైపు తీవ్ర ఆర్థిక సంక్షోభం ఇరాన్‌ను కుదిపేస్తోంది. గత కొన్ని వారాలుగా నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగంపై అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. అయితే, ఈ నిరసనలను అణచివేసేందుకు భద్రతా బలగాలు ప్రయోగించిన బలప్రయోగం తీవ్ర హింసకు దారితీసింది. అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించిన గణాంకాల ప్రకారం నిరసనకారులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటివరకు దాదాపు 3,000 మందికి పైగా ఆందోళనకారులు ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని తెలుస్తోంది. వేలాది మంది గాయపడగా, వందల సంఖ్యలో నిరసనకారులను ప్రభుత్వం అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఇరాన్‌లో పరిస్థితులు అత్యంత ఉద్రిక్తంగా ఉన్నాయి. రష్యా జోక్యంతోనైనా అక్కడి పరిస్థితులు సద్దుమణుగుతాయా లేదా అనేది వేచి చూడాలి.

## నిధుల కోసమే హస్తిన టూర్లు



(మొదటి పేజీ తరువాయి)

మర్చిపోయింది కాబట్టే రాష్ట్రానికి నష్టం జరిగిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలు కూడా కేవలం రాజకీయాలు చేయకుండా ఢిల్లీ నుంచి నిధులు తీసుకోవాలని హితవు పలికారు.
మున్సిపల్ ఎన్నికల నగారా
మున్సిపల్ ఎన్నికలపై రేవంత్ రెడ్డి స్పందించారు. డబ్బులకు ఆశపడి ఓటు వేస్తే ఐదేళ్లు బాధ పడాల్సి వస్తుందన్నారు. అభివృద్ధి చేసే వారికే ఓటు వేయండి.. ప్రజా ప్రభుత్వంతో కలిసి నడిచే నాయకులనే ఎన్నుకోవాలని అని సీఎం ప్రజలకు పిలుపునిచ్చారు.

## మేడారంలో తెలంగాణ కేబినెట్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.
మేడారం గద్దెపై జరగనున్న ఈ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకోనుంది. త్వరలో జరగనున్న సమ్మక్కసారలమ్మ మహా జాతర ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించడంతో పాటు నిధుల కేటాయించనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్చ జరపనున్నారు. రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన, రైతు భరోసా పథకం అమలు, మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై కేబినెట్ దిశానిర్దేశం చేయనుంది. మంత్రివర్గ సమావేశం నేపథ్యంలో ములుగు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహా మంత్రులందరూ హాజరుకానుండటంతో మేడారంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## టీఎస్ ఐపాస్‌కు నీతి ఆయోగ్ ప్రశంసలు తెలంగాణకే గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో పోరాటంతో సాధించుకున్న తెలంగాణను కేవలం పదేళ్ల వ్యవధిలోనే దేశానికి పారిశ్రామిక దిశానిర్దేశకంగా మార్చడంలో టీఎస్ ఐపాస్ కీలక పాత్ర పోషించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వ సంస్థే అంగీకరించడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. పరిశ్రమల స్థాపనలో ఉండే అనవసర అడ్డంకులను తొలగించి, సింగిల్ విండో విధానంలో 15 నుంచి 30 రోజుల్లోనే అన్ని అనుమతులు ఇచ్చేలా టీఎస్ ఐపాస్‌ను రూపొందించామని ఆయన వివరించారు. అవినీతికి తావులేని పారదర్శక వ్యవస్థను పదేళ్లపాటు క్రమబద్ధంగా అమలు చేయడం వల్లే అద్భుతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు.
ఈ విధానం ద్వారా భారీ పరిశ్రమలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగంలో దాదాపు రూ.2.6 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణకు వచ్చాయని కేటీఆర్ తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలో 25 లక్షల మందికి పైగా యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించగలిగామని చెప్పారు. ఇది దేశ పారిశ్రామిక చరిత్రలోనే ఒక విశిష్ట ఘట్టంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.
గతంలో రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, టీహబ్ వంటి వినూత్న కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినట్లే, ఇప్పుడు టీఎస్ ఐపాస్‌కూ అదే స్థాయి గుర్తింపు దక్కిందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి సంస్థల నుంచి స్థానిక చిన్న పరిశ్రమల వరకు తెలంగాణను పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా చూడటానికి ఈ విధానం పెట్టుబడిదారుల్లో అపార విశ్వాసాన్ని నింపిందన్నారు.
కేసీఆర్ పాలనలో రూపొందిన తెలంగాణ మోడల్ ఆచరణీయమని నీతి ఆయోగ్ స్వయంగా పేర్కొన్న నేపథ్యంలో దానిపై విమర్శలు చేయడం సరికాదని కేటీఆర్ హితవు పలికారు. కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తామనే భ్రమల్లో ఉన్న శక్తులు వాస్తవాన్ని గుర్తించి ఆలోచించాలి అంటూ ప్రస్తుత ప్రభుత్వంపై పరోక్షంగా ఆయన విమర్శలు చేశారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణాన్ని నిరాకరించడం కాదు, దానిని కొనసాగించడమే రాష్ట్ర భవిష్యత్తుకు మేలని ఆయన సూచించారు.

## మెట్రో ఫేజ్-2పై రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ పనుల పురోగతిపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మెట్రో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తక్షణ చర్యలను ఆయన ఈ లేఖలో ప్రస్తావించారు. ఇటీవల కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో జరిగిన భేటీ వివరాలను కిషన్ రెడ్డి ఈ లేఖలో వివరించారు. మెట్రో మొదటి దశను ఎల్ & టీ సంస్థ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని సీఎం ప్రకటించిన విషయాన్ని కిషన్ రెడ్డి లేఖలో ప్రస్తావించారు. రెండో దశ పనులకు కేంద్రం సహకారం అందించాలంటే, ముందుగా మొదటి దశకు సంబంధించిన ఒప్పందాలు, లావాదేవీలు, స్వాధీనం ప్రక్రియ పూర్తి కావాలని కేంద్ర మంత్రి ఖట్టర్ కోరినట్లు లేఖలో పేర్కొన్నారు.
సంయుక్త కమిటీ ఏర్పాటులో జాప్యం
మెట్రో మలిదశ సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులతో ఒక సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్రం నుంచి ఇద్దరు, రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారులతో ఈ కమిటీ ఏర్పడాలని, కేంద్రం తన వంతు ప్రక్రియకు సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు అధికారుల పేర్లు ప్రతిపాదించలేదని కిషన్ రెడ్డి అసంతృప్తిని వ్యక్తం చేశారు. హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకరించిందని, ఈ ప్రాజెక్టు వేగంగా పట్టాలెక్కాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని లేఖలో కోరారు.
ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు
మెట్రో ఫేజ్ 2పై కేంద్రం సానుకూలంగా ఉన్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేస్తూ అధికారుల పేర్లను ఎప్పుడు పంపుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కమిటీ ఏర్పాటుతో మెట్రో విస్తరణ పనుల్లో ఉన్న సాంకేతిక, ఆర్థిక అడ్డంకులు తొలగిపోయే అవకాశం ఉంది.

## మద్యం మత్తులో రచ్చ


### దంపతులు ప్రయాణిస్తున్న కారుపై రాళ్లతో దాడి

**విశ్వంభర, చైతన్యపురి :** రెస్టారెంట్లో డిన్నర్ ముగించుకుని తమ కారులో ఇంటికి వెళ్తున్న దంపతులపై మద్యం సేవించిన ఓ వ్యక్తి దాడి చేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ నగర్ లోని రావోయి రెస్టారెంట్లో భార్యాభర్తలు బుధవారం రాత్రి డిన్నర్ చేసి తమ కారులో ఇంటికి బయలుదేరారు. శృతి బార్ ముందు వద్దకు రాగానే ఎన్టీఆర్ నగర్ లో నివసించే శంకర్ నాయక్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఇష్టారీతిగా ప్రవర్తిస్తూ రోడ్డుపై ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ భయభ్రాంతులకు గురిచేశాడు. కింద పడుతూ లేస్తూ తనకు తానే గాయాలు చేసుకుంటూ, చేతిలో రాయి పట్టుకొని ఆ సమయంలో దంపతులు వస్తున్న కారును అడ్డగించాడు.గట్టిగా అరుస్తూ రాయితో కారు ముందు భాగాన్ని కొట్టడంతో పాటు అద్దాన్ని రాయితో గుద్ది పగలగొట్టాడు. వెంటనే దంపతులు కారులో నుంచి దిగిపోయి ఎందుకు ఇలా చేస్తున్నావు ? అని ప్రశ్నించగా, వారిని భూతులు తిడుతూ రాయి తీసుకొని దాడికి యత్నించాడు. దీంతో వారు వెంటనే కారులోకి వెళ్లి లోపలే ఉండిపోయారు. వెంటనే 100 డయల్కు ఫోన్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల చేతిలో ఉన్న ట్యాబ్ ను లాక్కొని నేలకేసి పడేసినట్లు తెలిపారు. దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు.

# పదేళ్ల స్టార్టప్ ఇండియా... యువ శక్తిపై ప్రధాని మోదీ ప్రశంసల జల్లు..!!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** భారత యువత తమ సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలతో దేశంలోని వాస్తవ సమస్యలకు పరిష్కారాలు వెతుకుతూ ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆయన ప్రారంభించిన 'స్టార్టప్ ఇండియా' కార్యక్రమం పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక వేడుకలో ప్రధాని ప్రసంగించారు. ఈ దశాబ్ద కాల ప్రయాణం కేవలం ఒక ప్రభుత్వ పథకం విజయకథ మాత్రమే కాదని, లక్షలాది యువత ఆశయాలు, కలలు నిజమయ్యే ప్రయాణమని ఆయన వ్యాఖ్యానించారు.

పదేళ్ల క్రితం దేశంలో స్టార్టప్‌ల సంఖ్య 500కి కూడా చేరలేదని గుర్తు చేసిన ప్రధాని, నేడు ఆ సంఖ్య 2 లక్షల మార్కును దాటిందన్నారు. అప్పట్లో కేవలం నాలుగు యూనికార్న్ కంపెనీలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 125కి పైగా యూనికార్న్‌లు క్రియాశీలంగా ఉన్నాయని తెలిపారు. ఈ అసాధారణ వృద్ధి ప్రపంచం మొత్తం దృష్టిని భారత్ వైపు తిప్పిందని, స్టార్టప్ వ్యవస్థ పరంగా భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద దేశంగా ఎదిగిందని చెప్పారు.



ప్రస్తుతం భారత స్టార్టప్‌లు డీప్ టెక్, స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ టెక్, క్వాంటం టెక్, అగ్రిటెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి 50కి పైగా రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నాయని మోదీ తెలిపారు. ఇవి దేశ ఆర్థిక వ్యవస్థకు కీలక బలంగా మారాయని చెప్పారు. వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అందించిన వివరాల ప్రకారం, ఈ స్టార్టప్‌లు దేశవ్యాప్తంగా 21 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలను సృష్టించాయని ప్రధాని పేర్కొన్నారు.

స్టార్టప్ ఇండియా ప్రయాణంలో మహిళల భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగిందని మోదీ తెలిపారు. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో సుమారు 45 శాతం సంస్థల్లో కనీసం ఒక మహిళ డైరెక్టర్ లేదా భాగస్వామిగా ఉన్నారని వెల్లడించారు. అలాగే దాదాపు సగం స్టార్టప్‌లు మెట్రో నగరాల వెలుపలే స్థాపితమై ఉండటం, టైర్2 మరియు టైర్3 పట్టణాలు కూడా ఆవిష్కరణలకు కేంద్రాలుగా ఎదుగుతున్నాయనడానికి నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఒకప్పుడు స్టార్టప్‌లు అంటే విఫలమయ్యే ప్రయోగాలుగా, కేవలం సంపన్న కుటుంబాల యువతకే పరిమితమైన అవకాశాలుగా భావించేవారని గుర్తు చేసిన మోదీ, స్టార్టప్ ఇండియా మిషన్ ఆ ఆలోచనలను పూర్తిగా మార్చేసిందన్నారు. నేడు దేశం నలుమూలల నుంచి సాధారణ నేపథ్యం ఉన్న యువత కూడా సాహసోపేతంగా వ్యాపార రంగంలో అడుగుపెడుతోందని చెప్పారు. "నా ముందున్న యువత ఆలోచనలు నాకు కొత్తగా రూపుదిద్దుకుంటున్న భారత భవిష్యత్తును చూపిస్తున్నాయి. మీ కలలే ఈ దేశ పురోగతికి ఇంధనం" అంటూ స్టార్టప్ వ్యవస్థాపకులను ప్రధాని ప్రశంసించారు.

**భవిష్యత్ దృష్టి: తయారీ రంగం**

డిజిటల్ సేవలు, సర్వీస్ రంగాల్లో భారత స్టార్టప్‌లు విశేషమైన విజయాలు సాధించాయని మోదీ అన్నారు. ఇప్పుడు అదే ఉత్సాహంతో తయారీ రంగంపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రపంచస్థాయి నాణ్యత కలిగిన ఉత్పత్తులను భారత్ నుంచే తయారు చేయాలని, సాంకేతికతలో కూడా వినూత్న ఆలోచనలతో ముందుండాలని సూచించారు. ప్రతి అడుగులో ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని స్టార్టప్‌లకు ఆయన భరోసా ఇచ్చారు.

స్టార్టప్‌ల వృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును గుర్తు చేస్తూ, 'ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఫర్ స్టార్టప్స్', 'క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్ ఫర్ స్టార్టప్స్', 'స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ స్కీమ్' వంటి పథకాలు కీలకంగా మారాయని ప్రధాని వివరించారు. జాతీయ స్టార్టప్ దినోత్సవం భారత ప్రజల ధైర్యం, సృజనాత్మకత, వ్యాపార ఉత్సాహానికి ప్రతీక అని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. 'వికసిత భారత్ 2047' లక్ష్య సాధనలో స్టార్టప్‌ల పాత్ర అత్యంత కీలకమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.




## ఇండ్లూరు గ్రామంలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

**విశ్వంభర, తిప్పర్తి :** తిప్పర్తి మండలం ఇండ్లూరు గ్రామంలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు జరిగాయి. ఆర్గనైజర్లు గా మామిడి శంకర్, మహేందర్ లు ఉన్నారు. ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతిగా 2000 రూపాయలు, రెండవ బహుమతిగా 1000 రూపాయలను తిప్పర్తి మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పల్ రెడ్డి రవీందర్ రెడ్డి, ఇండ్లూరు గ్రామ సర్పంచ్ పాప కంటి సైదులు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గద్దమీద గురవయ్య, మాజీ వార్డు మెంబర్ శ్రీకాకుళ పుష్పలత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మీడియాను గుప్పిట్లో పెట్టుకోవాలి అనుకుంటున్న రేవంత్ రెడ్డి

**ఎన్టీవీ జర్నలిస్ట్ ల అరెస్ట్ ను ఖండిస్తున్నాం: ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ**



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎన్టీవీ జర్నలిస్ట్ ల అరెస్ట్ ను ఖండిస్తున్నాం అని ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే తట్టుకోలేక ప్రభుత్వం మీడియాను టార్గెట్ చేస్తూ వారిని అరెస్టులు చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కె చెల్లింది అని మహేశ్వరం నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చలేక ప్రతిపక్షాలపై బూతు పురాణాలు, మీడియాపై ఆంక్షలు విధించి మీడియా రంగాన్ని తన గుప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నాడని అన్నారు. వారు ప్రసారం చేసిన వీడియోలకు ఎలాంటి ఆధారాలు లేకుంటే, ముందస్తు నోటీసు ఇచ్చి వారిని విచారణకు పిలిస్తే బాగుండు ను అని అన్నారు.. ఎలాంటి నోటీసు లేకుండానే అర్ధరాత్రి వారిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యని అన్నారు. మీ ప్రభుత్వంలో మంత్రిగా కొనసాగుతున్న కొండా సురేఖ కేటీఆర్ పై నిరాధారణ ఆరోపణలు చేసినప్పుడు ఈ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని అన్నారు.

## ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్

**జన జాగృతి ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు ఉషారాణి**




**విశ్వంభర, ఇబ్రహీంపట్నం :** ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని జన జాగృతి ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి అన్నారు. అంబేద్కర్ మహనీయునికి కృతజ్ఞతాపూర్వకంగా నిత్యజ్ఞానమాలలో భాగంగా ఇబ్రహీంపట్నం చౌరస్తాలో గల ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జన జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కోటగిరి ఉషారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ను ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బహుజనులకు, సామాజిక చరిత్రను నిర్మించి వారి విముక్తికి బాటలు వేసిన మహనీయుడని అన్నారు. అంటరానితనం, సామాజిక వివక్షను వ్యతిరేకించారని, దళితులకు రాజకీయ హక్కులు కల్పించాలని సామాజిక న్యాయం సాధించాలని కృషి చేశారు అని అన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం భారతదేశంలోని ప్రజలందరి రాజ్యాంగం భారతదేశంలోని ప్రజలందరికీ సమానత్వం, న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగురాజు, వర్త్య రమేష్ , పాతులోత్ సాగర్ ,వర్త్య సురేష్ , కేలోత్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పార్వేట ఉత్సవం

**విశ్వంభర, తిరుపతి :** తిరుమలలో మకర సంక్రాంతి మరుసటి రోజైన కనుమ సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామికి పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది. అదే రోజున గోదాపరిణయోత్సవం కూడా వైభవంగా నిర్వహించారు. ప్రాతఃకాలారాధన అనంతరం మలయప్పస్వామి తిరుచ్చిలో వేంచేసి పార్వేట మండపానికి చేరుకొని ఆరాధనలు, హారతులు నిర్వహించారు. స్వామివారి వేటను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉత్సవం మహాద్వారం వద్ద హాతీరాంజీవారి బెత్తం స్వీకరణతో ముగిసింది. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు, బోర్డు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





ప్రపంచ శాంతి సంఘీభావ సంఘం ఛైర్మన్ అలక్‌సేన్‌గుప్త హైదరాబాద్ వచ్చిన సందర్భంగా శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఆయనకు స్వాఘతం పలుకుతున్న ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాచం సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు రవికిషోర్, శ్రీధర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ ఎన్వీ సుబ్బారావు తదితరులు.

## బిల్లు పత్రాలు దగ్ధం : ఎస్ కె ఎమ్



**విశ్వంభర, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు ఎస్ కే యం మహబూబాబాద్ జిల్లా కన్వినింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చుతూ చట్టాన్ని తీసుకువచ్చింది. అదేవిధంగా విత్తన చట్టాన్ని కేంద్ర విద్యుత్ బిల్లును భీమా బిల్లును అనురంగంలో ప్రైవేటీకరణ బిల్లులను తీసుకరావడాని వ్యతిరేకిస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు ఎస్ కే యం జిల్లా కన్వీనర్ కమిటీ ఆధ్వర్యంలో బిల్లు పత్రాలను దగ్ధం చేశారు.

ఈ నిరసన కార్యక్రమానికి ఎస్కేయం జిల్లా కన్విన్ కమిటీ కన్వీనర్ గుజ్జు దేవేందర్ అధ్యక్షత వహించగా ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మండల వెంకన్న ఏఐపీకేఎస్ యు రాష్ట్ర నాయకులు ములుకూరి జగ్గన్న ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండ్లపల్లి వెంకటేశ్వర్లు ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ ఆలకుంట్ల సాయిలు లు మాట్లాడుతూ

కేంద్రంలోని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలతో ఎలాంటి చర్చలు జరపకుండానే శీతాకాల సమావేశంలో హడావిడిగా బిల్లులను ప్రవేశపెట్టి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చడంతో పాటుగా కేంద్రం నిధులను తగ్గించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వాలపై 40 శాతం విధిస్తూ కేంద్రం 60% భరిస్తామంటూ బిల్లుని చట్టంగా మార్చడం జరిగిందని ఇది కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలను మోసం చేయడమేనని అంతిమంగా ఈ పథకాన్ని నీరు కార్చుతూ భవిష్యత్తులో ఈ పథకాన్ని లేకుండా చేయడం కోసం బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వెంటనే చట్టాన్ని రద్దు చేస్తూ పాత ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని విత్తన బిల్లును విద్యుత్ బిల్లును భీమా బిల్లు అను విద్యుత్ బిల్లులను తేవడం అంటేనే కార్పొరేట్లకు అనుకూలంగా రైతాంగానికి కార్మికులకు పేద ప్రజలకు తీవ్రంగా నష్టం జరుగుతుందని అందుకని ఈ బిల్లును వెంటనే రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ బండారి ఐలయ్య జిల్లా కార్యదర్శి గునిగంటి రాజన్న కొత్తపల్లి రవి హలవతు లింగన్న కుంట ఉపేందర్ దొంతూజు ఉపేంద్ర చారి సామా పాపయ్య సమ్మెట రాజమౌళి కొమ్ము సోమయ్య దుడ్డేల రామ్మూర్తి రామచంద్రుని మురళి నల్లపు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ, మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం

**- మంత్రి సీతక్క**



**విశ్వంభర, వేములవాడ :** భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతోందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కోడె మొక్కు చెల్లించి, భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనులు రూ.150 కోట్లతో కొనసాగుతున్నాయని, భక్తులకు మెరుగైన వసతులు, త్వరిత దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



అలాగే మేడారంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఆదివాసీ భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రూ.200 కోట్లకు పైగా నిధులతో పనులు చేపట్టారని పేర్కొన్నారు. ఈ నెల 18న సీఎం రేవంత్ రెడ్డి మేడారం వెళ్లి కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారని, 19న జాతర పనులు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## జైపాల్ రెడ్డి 84వ జయంతి

**నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి**

**విశ్వంభర, హైదరాబాదు:** దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా నక్లెస్ రోడ్‌లోని ఆయన సమాధి స్ఫూర్తి స్థలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పలువురు ప్రజా ప్రతినిధులు అభిమానులు కాంగ్రెస్ శ్రేణులు జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతమ్ రావు**



**విశ్వంభర, హైదరాబాద్ :** ముంబయి మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతమ్ రావు అన్నారు. శుక్రవారం బర్కత్ పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ప్రజలు బీజేపీని విశ్వసిస్తూ ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, దేశ భద్రతకు బీజేపీయే సరైన ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. బీజేపీతోనే దేశ ప్రగతి సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కృష్ణ యాదవ్, కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, బీజేపీ నగర ప్రధాన కార్యదర్శులు అజయ్, వెంకట్ స్వామి, పందిర్ల ప్రసాద్, కన్న, సూర్యప్రకాశ్ సింగ్, శ్యామ్ రాజ్, రమేష్ యాదవ్, అనంతలక్ష్మి, వనం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాదు జింఖానా గ్రౌండ్‌లో హాట్ ఎయిర్ బెలూన్ షో – సందర్శకులకు కనువిందు

**విశ్వంభర, సికింద్రాబాద్ :** సికింద్రాబాదు జింఖానా గ్రౌండ్‌లో అద్భుతమైన హాట్ ఎయిర్ బెలూన్ షో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగర ప్రజలకు కొత్త అనుభూతిని అందించాలనే లక్ష్యంతో ఈ షోను ఏర్పాటు చేశారు. రంగురంగుల హాట్ ఎయిర్ బెలూన్ లు ఆకాశంలోకి ఎగసిపడుతూ చూపరులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళ నిర్వహించిన నైట్ గ్లో షోలో బిలూన్లకు లైట్లు వెలిగించడంతో జింఖానా గ్రౌండ్ మొత్తం వెలుగులతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు, యువత, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బెలూన్ రైడ్స్‌కు కూడా అనుమతి ఇవ్వడంతో ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాదు పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడానికే ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారులు తెలిపారు.



## గతంగా, చరిత్రగా..

# వ్యక్తి"గత" గోప్యతా హక్కు



ఇప్పుడు ఏదీ రహస్యం కాదు. అంతా పబ్లిక్కే. భార్యాభర్తల పడక గది దృశ్యాలు, వివాహ బంధంలో లేని ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే సన్నిహిత సన్నివేశాలు, కొందరి బాత్, బెడ్ రూమ్ లలోని నగ్న, అర్ధనగ్న చిత్రాలు, దృశ్యాలు అన్నీ పబ్లిక్కే. ప్రైవేట్ జీవితం అనేదే ఎవరికీ లేకుండా పోతున్నది. కాదు లేకుండా చేసి పడేసింది ఆధునిక సమాజం. మూడో మనిషికి తెలియకూడని పడక గది సంగతులు కూడా పబ్లిక్ డొమెయిన్ లోకి తీసుకుని రావడం ఒక ట్రెండ్ అని అంటున్నారు. పౌరుల వ్యక్తిగత, ఆంతరంగిక, ప్రైవేటు సంగతులను తెలుసుకోవడం,వాటిని లోకానికి తెలియ జెప్పడం అనేది ఈ వికృత ధోరణి/ట్రెండ్ మాత్రమే అవుతుంది. ఈ వికృత ట్రెండ్ మీడియాకు ఒక ప్రధాన అమ్మకపు వనరు, సరుకుగా మారిపోయింది. ప్రధానంగా ఎలెక్ట్రానిక్ మీడియా తన వీక్షకుల సంఖ్య టీ.ఆర్.పీ (టెలివిజన్ రేటింగ్ పాయింట్ /టార్గెట్ రేటింగ్ పాయింట్)ని వేగంగా,సులభంగా పెంచుకునే ఒక వనరు ,సరుకుగా మారిపోయింది. మారిపోయింది అని చెప్పడం సరైంది కాదేమో. మీడియా వ్యాపారులు ఈ వికృత ట్రెండ్ ను తమ అమ్మకపు సరుకుగా ఎంచుకున్నారు, మార్చుకున్నారు అని చెప్పడమే సరైన మాట అవుతుందేమో. టీ.ఆర్. పీ ఆధారంగా వ్యాపార ప్రకటనలు పెరిగి పోతాయి. దాని ఆధారంగా ఎక్కువ ఆదాయం సమకూర్చుకునే ఒక సులభ మార్గం అవుతున్నది ఈ ట్రెండ్. అందుకే ఎలక్ట్రానిక్ టీవీ మీడియా ఈ అడ్డదారిని ఎంచుకున్నది. ఈ దారిలో మీడియా చేసే వికృత కవరేజి వల్ల ఆయా వ్యక్తుల వ్యక్తిగత గోప్యతకు తీవ్రమైన విఘాతం కలిగి ఆ హక్కు పతనమై పోతున్నది. పౌరులకు రాజ్యాంగం ఇచ్చిన ఈ ప్రజాస్వామిక హక్కు పట్ల మీడియా వ్యాపారులకు ఎలాంటి గౌరవం లేదు. అందుకే ఈ ట్రెండ్ ను సులువుగా ఆదాయం మెరుగుపడే వనరుగా మార్చుకున్నది. అలా ఆ ట్రెండ్ లో భాగంగా పడక గది దృశ్యాలు, వ్యక్తుల ఆంతరంగిక ప్రైవేట్ జీవిత విషయాలను బహిర్గతం చేస్తూ, వాటిని కథలుగా ,కథనాలుగా వండి వార్చుతూ టీ.వీ వీక్షకుల సంఖ్యను పెంచుకుంటూ ముందుకు సాగుతున్నది.

రెండు రోజులు కింద హైదరాబాద్ లో ముగ్గురు తెలుగు టీవీ జర్నలిస్టుల అరెస్టుకు నేపథ్యం అలాంటిదే.

నల్లగొండ జిల్లాకు చెందిన ఒక మంత్రి ఐ.ఏ.ఎస్ అధికారిణి మధ్య సంబంధం అని చెబుతూ ఆ టీవీ కొన్ని కథనాలను ప్రసారం చేసింది. దీని వెనక అనేక రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ప్రభుత్వంలోని అంతర్గత కుమ్ములాట దీని నేపథ్యం అని ఒక కథనం ప్రచారంలో ఉంది. అదేమీ కాదు వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఉందనే కథనం కూడా ప్రచారంలో ఉన్నది.

ఇది నిజమో, కాదో తెలియదు. ఒకవేళ అది నిజమే అయినా దానితో సమాజానికి ఏమీ సంబంధమూ లేని విషయం. సమాజానికి ఏ మాత్రం అవసరం, అక్కరలేని వారిద్దరి ఆంతరంగిక విషయాన్ని వీధిలో పెట్టి రచ్చ చేయడం ఏమిటి? ఈ ట్రెండ్ ఇప్పుడే ఇక్కడ కొత్తగా పుట్టుకు వచ్చింది ఏమీ కాదు.

కొద్ది రోజుల కిందటి సినిమా పరిశ్రమకు చెందిన సమంత అనే నటీమణి ఎపిసోడ్ అలాంటిదే.

ఈ ట్రెండ్ ఇక్కడికే పరిమితమైనది ఏమీ కాదు. రెండు దశాబ్దాల కింద ప్రిన్సెస్ డయానాను బలి తీసుకున్నది కూడా ఈ వికృత ట్రెండే. దాన్ని పాపరాజ్జి అని పేర్కొన్నారు. ఇతరుల పడక, స్నానపు గదుల్లోకి తొంగి చూసే ఈ అసభ్య పనిని చేసే వారిని పీపింగ్ టామ్ అని వాయిరిస్టు అని కూడా పిలుస్తారు.

ఇది ఒక వికృత మానసిక ప్రవృత్తి. ఈ దేశంతో సహా అనేక ప్రజాస్వామిక సమాజాల్లో ఇది ఒక నేరం.

ముగ్గురు తెలుగు జర్నలిస్టుల నిన్నటి అరెస్ట్ ఆ నేరం ఆధారంగానే జరిగింది.

అరెస్ట్ జరిగిన తీరు మాత్రం సరైంది కాదు. నిజానికి అలా అరెస్ట్ చేయనవవసరం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. వ్యక్తిగత గోప్యతను బలహీనపరిచే అనేక రకాల కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరోక్షంగా రాజ్యం అనేక ప్రయత్నాలను చాలా కాలంగా చేస్తున్నది. ఫోన్ ట్యాపింగ్ దానిలో ఒకటి. నేరాల నివారణ, జరిగిన నేరాల విచారణ కోసం అని చెబుతూ అన్ని వీధుల్లో, అడుగడుగునా ఏర్పాటు చేసిన సీ సీ కెమెరాలు కూడా అలాంటి ప్రయత్నాల్లో ఒకటి అవుతుంది. అంతే కాదు బ్యాంకులు, బీమా సంస్థల వద్ద పౌరులు ఇచ్చిన ఆధార్ లాంటి వివరాలను వ్యాపార సంస్థలు కొనుగోలు చేస్తున్నాయి. వ్యాపార సంస్థలు తమ వ్యాపార విస్తరణకు కొనుగోలు చేసిన వివరాలను వినియోగిస్తున్నాయి. అంతే కాదు అవి నేరస్తుల ముఠాల గుప్పిట్లోకి చేరిపోయి అనేక సైబర్ నేరాలకు దారి తీస్తున్నాయి. అంటే వ్యక్తుల వ్యక్తిగత వివరాలు చాలా వరకు మార్కెట్ లోకి నేరస్తుల గుప్పిట్లోకి ఇప్పటికే చేరిపోయాయి. అంటే మన వ్యక్తిగత సమాచారం ఇప్పుడు పబ్లిక్ సమాచారంగా మారిపోయిందని అర్థం. ఈ క్రమంలో పౌరుల వ్యక్తిగత సమాచారం ఇప్పుడు పూర్తిగా బహిరంగమైపోయాయి. అలా సమాచార గోప్యత అనేది ఒక గతంగా, చరిత్రగా మారిపోయి గోప్యతా హక్కు అపహాస్యం పాలై పోతున్న దుస్థితిని ఎదుర్కొంటున్నది.



- గందె గోవర్ధన్,
ఫోన్ : 9347056621

# సంస్కరణా..? రాజకీయ వ్యూహమా?

## హైదరాబాద్ విస్తరణపై భిన్న స్వరాలు, విస్తృత చర్చలు




హైదరాబాద్ నగరం భారతదేశ పట్టణ వికాస చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. రాజ్యాంగానంతర కాలంలో ఒక ప్రాంతీయ రాజధానిగా ప్రారంభమైన ఈ నగరం, కాలక్రమేణా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మెట్రోపాలిటన్ నగరంగా రూపాంతరం చెందింది. జనాభా విస్తరణ, వలసల పెరుగుదల, సమాచార సాంకేతిక రంగ విప్లవం, రియల్ ఎస్టేట్ అభివృద్ధి వంటి అంశాలు హైదరాబాద్ రూపురేఖలను పూర్తిగా మార్చేశాయి. ఈ విస్తరణతో పాటు నగర పాలన ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తీవ్రమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్విభజన లేదా డీలిమిటేషన్ అంశం కేవలం పరిపాలనా చర్యగా కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థ నాణ్యతను నిర్ణయించే కీలక అంశంగా మారింది.

హైదరాబాద్ మున్సిపల్ పాలన చరిత్రను పరిశీలిస్తే, 1955లో మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్‌గా ఏర్పడినప్పటి నుంచి నగరం అనేక దశల్లో విస్తరించింది. అప్పట్లో నగర విస్తీర్ణం సుమారు 175 చదరపు కిలోమీటర్లు కాగా, జనాభా 12 నుంచి 15 లక్షల మధ్యే ఉండేది. పరిమిత పరిధిలో పరిపాలన సాగిన ఆ దశలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నగర సమస్యలపై పట్టు ఉండేది. కానీ 1990ల తరువాత హైదరాబాద్ ఐటీ హబ్‌గా ఎదగడం ప్రారంభమైనప్పటి నుంచి నగర ముఖచిత్రం వేగంగా మారింది. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి ప్రాంతాలు ప్రపంచ స్థాయి కార్పొరేట్ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి.

ఈ వేగవంతమైన విస్తరణకు పరిపాలనా రూపం కల్పించాల్సిన అవసరంతో 2007లో అప్పటి ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను చుట్టుపక్కల ఉన్న 12 మున్సిపాలిటీలు, 8 గ్రామ పంచాయతీలతో విలీనం చేసి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఈ విలీనంతో నగర విస్తీర్ణం సుమారు 650 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అప్పటి అంచనాల ప్రకారం జనాభా 75 లక్షలకు పైగా చేరింది. పట్టణ ప్రణాళికను సమగ్రంగా అమలు చేయడం, మౌలిక వసతుల అభివృద్ధిని ఒకే పాలనా పరిధిలో సమన్వయం చేయడం ఈ విలీనానికి ప్రధాన ఉద్దేశంగా ప్రకటించారు.

అయితే, విస్తీర్ణం పెరిగిన కొద్దీ పరిపాలనా అసమానతలు కూడా స్పష్టమయ్యాయి. కొన్ని ప్రాంతాలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందగా, మరికొన్ని ప్రాంతాలు మౌలిక వసతుల కొరతతోనే కొనసాగాయి. ఈ నేపథ్యంలో 2016లో జీహెచ్ఎంసీలో మరోసారి డీలిమిటేషన్ చేపట్టి, అప్పటివరకు ఉన్న 72 డివిజన్లను 150 వార్డులుగా విభజించారు. ఒక్కో వార్డుకు సగటున 40 నుంచి 50 వేల జనాభా ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఆ సమయంలో ఈ నిర్ణయం పరిపాలనా సమర్థతకు దోహదపడుతుందని భావించారు.

కానీ గణాంకాలు చెబుతున్న వాస్తవం మరోలా ఉంది. 2011 జనగణన ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ జనాభా సుమారు 77 లక్షలు. అయితే పట్టణాభివృద్ధి శాఖ, నగర ప్రణాళిక సంస్థల తాజా అంచనాల ప్రకారం 2024-25 నాటికి ఈ సంఖ్య కోటిన్నరకు చేరింది. కొన్ని అంచనాల ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజుకు సగటున 800 నుంచి 1000 మంది వలస దారులు స్థిరపడుతున్నారు. ఐటీ, నిర్మాణ రంగాల్లో ఉద్యోగావకాశాలే ఇందుకు ప్రధాన కారణం. ఈ వలసల ప్రభావంతో కొన్ని వార్డుల్లో జనాభా లక్ష నుంచి లక్షన్నర దాటింది. జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 30 వేల నుంచి 35 వేల వరకు ఉన్న ప్రాంతాలు కూడా ఉన్నాయి.

ఈ పరిస్థితుల్లో 2016 డీలిమిటేషన్ లక్ష్యాలు చాలావరకు నిర్వీర్య మయ్యాయి. ఒక్కో కార్పొరేటర్ పరిధిలో జనాభా విపరీతంగా పెరగడంతో ప్రజా సమస్యలపై సమర్థవంతమైన పర్యవేక్షణ కష్టమైంది. పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక అంశాలపై ఫిర్యాదులు పెరిగినా, వాటిని సమయానికి పరిష్కరించే సామర్థ్యం పరిమితమైంది. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉండాలన్న మౌలిక సూత్రమే ప్రశ్నార్థకంగా మారింది.

ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ పునర్విభజన లేదా తాజా డీలిమిటేషన్ అవసరం తెరపైకి వచ్చింది. డీలిమిటేషన్ అంటే కేవలం వార్డుల సంఖ్య పెంచడం కాదు. జనాభా సమతుల్యత, భౌగోళిక సౌలభ్యం, సామాజిక అనుసంధానం, రహదారి నెట్‌వర్క్, సహజ హద్దులు వంటి అంశాల ఆధారంగా పరిపాలనా సరిహద్దులను పునః రూపకల్పన చేయడం. దీని ప్రధాన ఉద్దేశం ప్రజలకు పాలనను మరింత దగ్గర చేయడం.

డీలిమిటేషన్ ప్రయోజనాలు అనేకం. చిన్న వార్డులు ఏర్పడితే ప్రజా ప్రతినిధికి తన పరిధిలోని సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉంటుంది. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పగలుగుతారు. అధికార యంత్రాంగానికి కూడా పనిభారం సమంగా పంచ బడుతుంది. వార్డు స్థాయి కమిటీలు సమర్థంగా పనిచేసే అవకాశం ఉంటుంది. బడ్జెట్ కేటాయింపులు కూడా అవసరాల ఆధారంగా సముచితంగా జరిగే వీలుంటుంది. ముఖ్యంగా పట్టణ పేదలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం పెరుగుతుంది.

అయితే డీలిమిటేషన్‌కు లోపాలు కూడా ఉన్నాయి. హద్దుల పునర్విభజన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా జరిగితే ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. కొన్ని కాలనీలు సామాజికంగా ఒకటిగా ఉన్నప్పటికీ వేర్వేరు వార్డుల్లోకి చీలిపోవడం వల్ల సమస్యలు తలెత్తుతాయి. ప్రజలకు తమ కార్పొరేటర్ ఎవరో తెలియని పరిస్థితి కూడా ఏర్పడుతుంది. అదనంగా, కొత్త వార్డుల ఏర్పాటుతో పరిపాలనా వ్యయాలు పెరుగుతాయి. సిబ్బంది నియామకాలు, కార్యాలయాలు, మౌలిక వసతుల ఏర్పాటు కోసం అదనపు ఖర్చు అవసరం అవుతుంది.

ఈ అంశంపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. అధికార పార్టీల నేతలు డీలిమిటేషన్‌ను పరిపాలనా అవసరంగా చిత్రీకరిస్తూ, నగర అభివృద్ధికి ఇది తప్పనిసరి అంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పరిపాలనా యూనిట్లు మారాల్సిందేనని వారు వాదిస్తున్నారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు డీలిమిటేషన్ వెనుక రాజకీయ లెక్కలున్నాయంటూ ఆరోపిస్తున్నాయి. వార్డుల హద్దుల మార్పుతో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయాలన్న ప్రయత్నమే దీనికి కారణమని వారు విమర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో తమ బలాన్ని తగ్గించేలా హద్దులు మార్చుతున్నారన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది.

నగరానికి చెందిన కొంతమంది సీనియర్ రాజకీయ నేతలు మాత్రం డీలిమిటేషన్ అవసరమేనని అంగీకరిస్తూనే, దాన్ని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని సూచిస్తున్నారు. జనాభా గణాంకాలు, భౌగోళిక అంశాలు, ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా జరిగే పునర్విభజన నగర పాలనను మరింత గందరగోళానికి గురి చేస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజలతో సంప్రదింపులు, అభ్యంతరాల స్వీకరణ, నిపుణుల సూచనలు వంటి ప్రక్రియలు లేకుండా డీలిమిటేషన్ చేస్తే న్యాయపరమైన వివాదాలు తప్పవని అభిప్రాయ పడుతున్నారు.

జీహెచ్ఎంసీ పునర్విభజన అంశాన్ని విస్తృతంగా పరిశీలిస్తే, ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల వరకే పరిమితం కాదని స్పష్టమవుతుంది. నగర ప్రణాళిక, మౌలిక వసతుల అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య బలోపేతం వంటి అంశాలతో ఇది ముడిపడి ఉంది. ప్రపంచంలోని ఇతర మెట్రో నగరాల అనుభవాలు చూస్తే, పరిపాలనా యూనిట్లను కాలానుగుణంగా సవరించుకుంటూ వెళ్లిన నగరాలే స్థిరమైన అభివృద్ధిని సాధించాయి.

హైదరాబాద్ లాంటి వేగంగా విస్తరిస్తున్న నగరానికి డీలిమిటేషన్ ఒక అవసరం. కానీ అది ప్రజా హితం కేంద్రంగా, పారదర్శకంగా, శాస్త్రీయంగా జరగాలి. కేవలం సంఖ్యల మార్పుతో కాకుండా, డిజిటల్ గవర్నెన్స్, జియోమ్యాపింగ్ ఆధారిత సేవలు, ప్రజల భాగస్వామ్యం వంటి సంస్కరణలతో అనుసంధానించి నప్పుడే పునర్విభజనకు అర్థం ఉంటుంది. లేకపోతే, హద్దులు మారినా సమస్యలు అదే స్థాయిలో కొనసాగుతాయి.

మొత్తంగా చెప్పాలంటే, జీహెచ్ఎంసీ పునర్విభజన హైదరాబాద్ నగర భవిష్యత్తును నిర్దేశించే కీలక మలుపు. ఇది పరిపాలనా సమర్థతకు దోహద పడాలంటే రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా అమలు కావాలి. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరానికి తగిన పరిపాలనా రూపాన్ని ఇవ్వడమే ఈ ప్రక్రియ యొక్క నిజమైన లక్ష్యంగా ఉండాలి. అప్పుడు మాత్రమే జీహెచ్ఎంసీ డీలిమిటేషన్ నగరాభివృద్ధికి బలమైన పునాది అవుతుంది.

# ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర నాగోబా



నాగోబా జాతర ప్రపంచంలోని అతి పెద్ద గిరిజన జాతరల్లో ఒకటి. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతరలో సర్పజాతిని పూజించడమే ప్రత్యేకత.అమావాస్య రోజు తమ ఆరాధ్య దైవమైన నాగోబా (శేష నారాయణ మూర్తి) పురి విప్పి నాట్యమాడతాడని గిరిజనుల నమ్మకం. అమా వాస్యనాడు సాయంత్రం ఏడు గంటల నుంచి రాత్రి పన్నెండు గంటల మధ్య కాలంలో గిరిజన పూజారులకు తమ ఆరాధ్య దైవం ఆదిశేషువు కనిపిస్తాడనీ, వారందించే పాలు తాగి ఆశీర్వదించి అదృశ్య మవుతాడని గిరిజనులు విశ్వసిస్తారు. ఆదిమ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్య దైవం నాగోబా గోండుల దేవత. నాగోబా దేవాలయం ఆదిలాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది. కెస్లాపూర్‌లో జరిగే ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. కెస్లాపూర్ జనాభా 400కు మించదు. కాని పండగ నాడు లక్షలాది మందితో అది జనా రణ్యంగా మారుతుంది.

జనవరి 18 నుంచి 24 వరకు నిర్ణీత రోజుల పాటు గిరిజనులు ఈ పండుగ జరుపు కుంటారు. ఏటా పుష్యమాస అమావాస్య రోజున జాతర ప్రారంభ మవుతుంది. నాగోబాను కొలిస్తే పంటలు బాగా పండుతాయని, శాంతి విరాజిల్లుతుందని, రోగాలు మటు మాయమ వుతాయని గిరిజనుల నమ్మకం.

నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పుకుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయి మోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుం పూరైందని చెపుతారు. ఆ తరువాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్ఠలు కావాలో, సంప్రదాయం కావాలో తేల్చు కోమనగా గౌరి సంప్రదాయాలను లెక్క చేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఆ తరువాత ఉడుంపూర్ నుంచి గరిమెల వరకు అతని కోసం వెతికిన గౌరి గోదావరి లోనే సత్యవతి గుండంలో కలిసి పోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్ళి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని (పేథికొరి యాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెప్తుంటారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారి పోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా పుష్య మాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమ వుతాడని గిరిజనుల నమ్మకం. నాగోబా దేవతకు పూజలు మేస్రం వంశీయులే నిర్వహిస్తారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తాయి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్క, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వెత ఇంటి పేర్లు గలవారంతా మేస్రం వంశంలో వస్తారు.

వృత్తుల ఆధారంగా 17 శాఖలుగా చీలిన మేస్త్రం వంశస్థులలోని కటోడా దివాకర్ గారికి , ఘాడియా సంకేపాయిలర్ వాడే శాఖల వారు కేస్లాపూర్ జాతరకు 16 రోజుల ముందు పుష్యమాస పౌర్ణమికి ఒక రోజు ముందు తమ కులదైవాన్ని పుష్య అమావాస్య రోజున అభిషేకించడానికి పవిత్ర గోదావరి జలం తేవడానికి కాలినడకన బయలుదేరి వెళతారు. కేస్లాపూర్‌కు సుమారు వంద కిలో మీటర్ల దూరంలో ఉన్న కలమడుగు మండలం సమీపాన ఉన్న గోదావరి నదిలో హస్త మడుగు వరకు అరణ్యం గుండా నడచి వెళ్లి గోదావరి జలం కలశంతో తీసుకుంటారు. హస్త మడుగులో గిరిజనుల పూర్వులు స్నానం చేస్తుండగా నాగదేవత ప్రత్యక్ష మయి దర్శన మయిందనే నమ్మకంతో అక్కడి జలాన్ని పవిత్ర జలంగా గిరిజనులు భావిస్తుంటారు.

పుష్య పౌర్ణమినాడు మేస్రం వంశీయులు 20 మంది గిరిజనులు వెంటరాగా కొత్త కుండలతో కడెం మండలం లోని గొడిసిర్యాల పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గోదావరి జలాన్ని తీసుకు వచ్చేందుకు బయలు దేరుతారు. దీంతో జాతర ప్రారంభమైనట్టే. ఆ జలాన్ని తీసుకు రావడానికి కెస్లాపూర్ నుంచి గోదావరి దాకా కాలినడకన 80 కిలోమీటర్లు వెళ్తారు. కెస్లాపూర్ చేరుకొని జాతర ప్రాంగణంలోని గిరిజనులు చెప్పుకునే ప్రాశస్త్యం గల మర్రి చెట్టు కింద విడిది చేసి అమావాస్య రోజు రాత్రి నాగోబాకు కొత్త కుండల్లో గోదావరి నుంచి తెచ్చిన నీళ్లతో అభిషేకం చేస్తారు. తరువాతే క్షీరాభిషేకం చేసి గిరిజన ఆచారాల మేరకు పూజలు నిర్వహిస్తారు. జాతరకు వచ్చే మేస్రం వంశీయులు వేలాది మంది ఉన్నా వారు వంట చేసుకునేది మాత్రం 22 పొయ్యిల మీదే. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ లోపల, గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు (దుగుడు) ఉన్నాయి. ఆ దీపాల కాంతుల వెలుగులో 22 పొయ్యిల్లో మేస్రం వంశీయుల వంతుల వారిగా వంటలు చేసుకుంటారు. మిగితా జాతుల వారు ఎక్కడైనా వంట చేసుకోవచ్చు. ఇచ్చోడ మండలం సిరికొండ లోని గుగ్గిల్ల వంశీయులు మాత్రమే నాగోబా కోసం కుండలు తయారు చేయడం ఆచారంగా వస్తోంది. పుష్య మాసంలో నెలవంక కనిపించిన తరువాత మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లలో సిరికొండకు వస్తారు. అక్కడి గుగ్గిల్ల వంశస్థుడైన కుమ్మరి ఇళ్ళకు వెళ్లి, కుండలు తయారు చేయాలని కోరుతారు. వంటల కోసం రెండు పెద్ద కుండలు, (కాగులు), వాటిపై కప్పిపెట్టేందుకు పాత్ర (చిప్పలు), దీపాంతలు, నీటికుండలు కలిపి తయారీకి ఆర్డర్ ఇస్తారు. మేస్రం వంశీయులు ఈ కుండల్లోనే గంగా జలాన్ని తీసుకురావడమే కాకుండా, వంట చేసి జాతరలో భక్తులకు భోజనం పెడతారు.


కేస్లాపూర్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఇంద్రవెల్లిలో ఆగి, అక్కడ వెలిసిన ఇంద్రాదేవికి సామూహికంగా పూజలు జరుపుతారు. ఇక్కడి నుంచి కేస్లాపూర్ చేరి ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న మర్రి చెట్టు కింద నాలుగు రాత్రులు, ఒక పాకలో మూడు రాత్రులు సామూహిక పూజలు జరిపి కేస్లాపూర్ మందిరానికి వాయిద్యాలతో ఊరే గిస్తూ తెచ్చి ఆలయం వద్ద ఉన్న మర్రి చెట్టుపై పవిత్ర జలకలశం భద్రపరిచి, పది కిలోమీటర్ల దూరం లోని సిరికొండ చేరుకుంటారు. సరిగ్గా పుష్య అమావాస్య రోజున కలశం భద్రపరిచిన మర్రిచెట్టు దగ్గర బావినీరు మట్టి కలిపి ఒక పుట్టను తయారు చేసి ఆలయం పక్కన ఉన్న పూల మందిరాన్ని ఆ మట్టితో అలికి అమావాస్య అర్ధ రాత్రి కలశంలో ఉన్న జలంతో ఆలయంలో ఉన్న నాగదేవతను అభిషేకిస్తారు.

గోదావరి నదినుంచి తెచ్చిన జలంతో నాగోబా విగ్రహాన్ని శుభ్ర పరుస్తారు. ఆలయాన్నంతా శుద్ధి చేస్తారు. బాజా భజంత్రీలతో ఆలయ ప్రాంగణంలో పూజా కార్య క్రమాలకు నిర్వహిస్తారు. ప్రత్యేక పూజ సమయంలో మొలకెత్తిన నవ ధాన్యాలను తెస్తారు. ఒక రాగి చెంబులో పాలను తీసుకుంటారు. నవ ధాన్యాలు, మొలకలు, పాలు అన్నిటికీ ఒక కొత్త రుమాలుతో కప్పి పుట్టపైన ఉంచుతారు. పుట్టమీది రుమాలు 'పైకెత్తినట్లు' కనిపిస్తే పూజా కార్యక్రమాలను ఆరం భిస్తారు. ఇప్పటికీ నాగ దేవుడు రాగి చెంబులోని పాలు తాగు తాడనే విశ్వాసం వారిలో ఉంది.

మెస్రం వంశస్థుల్లో వివాహమైన నూతన వధువులను తప్పక కేస్లాపూర్‌లో నాగోబా దేవుని వద్దకు తీసుకెళతారు. ఆమె చేత ఆ దేవునికి పూజ చేయించి వధువును పరిచయం చేస్తారు. దీన్నే 'భేటింగ్ కీయ్‌వాల్' అంటారు. వధువులు ఇంటి నుంచి ఎడ్లబండి వెనుక వెదురు బుట్టలో పూజ సామాగ్రిని ఉంచుకుని, కాలి నడకన బయలు దేరతారు. కేస్లాపూర్‌లోని నాగోబా గుడిని చేరుకుంటారు. పరిచయం చేయాల్సిన వధువులను 'భేటి కొరియాడ్' అని పిలుస్తారు. పూజలకు ముందు నాగోబా దేవుని దగ్గరకు వారిని తీసుకెళ్లి పరిచయం చేస్తారు. అక్కడి నుంచి శ్యాంపూర్ లోని (బోదుందేవ్) జాతర అయ్యాక ఎవరి గృహాలకు వాళ్లు వెళతారు.

గతంలో మారుమూల గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు లేవు. నాగరికులంటేనే ఆదివాసులు పరుగెత్తేవారు. గిరిజనుల వద్దకు అధికారు లెవరు వెళ్లేవారు కాదు. అప్పుడే భూమి కోసం, విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి కొమురం భీం మరణించాడు. ఈ సంఘటనతో ఉలిక్కి పడ్డ నిజాం ప్రభువులు గిరిజన ప్రాంతాల పరిస్థితులు, గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ ను ఆదిలాబాద్ జిల్లాకు పంపగా, కొండలు, కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలను తెలుసు కొని పరిష్కరించేందుకు జాతరలో దర్బార్‌ను ప్రొఫెసర్ 1942లో మొదట నిర్వహించాడు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. జాతర చివరి రోజున జరిగే ఈ దర్బార్‌కు గిరిజన పెద్దలు, తెగల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతూ ఉంటారు. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో జనవరి 18 నుంచి 8 రోజుల వరకు నిర్వహించ నున్నారు. మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్ పటేల్, పెద్దలు చిన్ను పటేల్ ఆధ్వర్యంలో సంప్రదాయ పూజలు, కార్యక్ర మాలు, మెస్రం వంశీయులు నిర్వహించే మహా పూజలతో పాటు రోజువారీ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

## ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ మోసాలు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**విశ్వంభర, కర్నూలు :** ప్రభుత్వ పథకాల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసాలకు గురి చేస్తున్నారని డీఐజీ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ (ఐపీఎస్) తెలిపారు. పీఎం కిసాన్, ముద్ర లోన్స్, సూర్యఘర్, అమ్మవడి వంటి పథకాల పేరుతో సోషల్ మీడియాలో ఫేక్ లింకులు పంపుతూ ప్రజల ఖాతాలను ఖాళీ చేస్తున్నారని శుక్రవారం హెచ్చరించారు. 'ఇది ప్రభుత్వం ప్రారంభించిన కొత్త పథకం. ఇప్పుడే దరఖాస్తు చేసుకోండి. లక్షల రూపాయల రాయితీ లభిస్తుంది' అంటూ ఆకర్షించి ఖాతాల వివరాలు, ఓటీపీలు తీసుకొని మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికే ఆయా పథకాలకు దరఖాస్తు చేసిన వారినే లక్ష్యంగా చేసుకుని నేరగాళ్లు దాడి చేస్తున్నారని తెలిపారు. పథకాల పేరుతో మొబైల్‌కు వచ్చే తెలియని ఫేక్ లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సూచించారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు ఎవరికీ చెప్పవద్దని స్పష్టం చేశారు.
సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యాశ, అశ్రద్ధ వల్లే ఎక్కువగా మోసపోతున్నారని అన్నారు. మోసగాళ్ల మాటలు నిజమని నమ్మవద్దని హితవు పలికారు.
అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయాలని, అలాగే www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల సమాచారం కోసం www.gov.in, nic.in వంటి అధికారిక డొమైన్‌లనే ఉపయోగించాలని తెలిపారు. ఇలాంటి మోసాల గురించి కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని కోరారు.

## సమ్మక్క–సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి

### మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ఆర్టీసీ ప్రత్యేక లాజిస్టిక్ సేవలు



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క-సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో, అమ్మవార్లకు బంగారం సమర్పించాలనుకునే భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక లాజిస్టిక్ సేవలను ఏర్పాటు చేసినట్లు సంస్థ వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. మేడారం బంగారం ప్రసాదం బుకింగ్‌కు సంబంధించిన పోస్టర్‌ను వీసీ అండ్ ఎండీ వై. నాగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, శ్రీ వెంకన్న, సీటీఎం (మార్కెటింగ్ & కమర్షియల్) శ్రీధర్, ఏటీఎం రాజన్ పాల్గొన్నారు.
ములుగు జిల్లాలోని మేడారంలో అమ్మవార్లను దర్శించి బంగారం సమర్పించడం ఆనవాయితీ. అయితే వివిధ కారణాల వల్ల మేడారం వెళ్లలేని భక్తుల కోసం అమ్మవార్ల బంగారం ప్రసాదాన్ని ఇంటి వద్దకే చేర్చేలా టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. దేవాదాయ శాఖ సహకారంతో దేవతల ఫోటోతో పాటు బెల్లం, పసుపు, కుంకుమతో కూడిన బంగారం ప్రసాదం ప్యాకెట్‌ను భక్తులకు అందజేస్తారు. ఇందుకోసం భక్తులు రూ.299/ చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు www.tgsrtclogistics.co.in వెబ్‌సైట్ ద్వారా లేదా సమీపంలోని టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కౌంటర్లలో బుకింగ్ చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం 04069440069, 04023450033 నంబర్లలో టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికకు రాష్ట్రపతి ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపికను న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆహ్వానించారు. ఈ ఆహ్వానం దేశానికి గర్వకారణమని, క్రీడల్లో వికలాంగుల ప్రతిభకు లభించిన గౌరవంగా భావించవచ్చని క్రీడాభిమానులు అభిప్రాయపడ్డారు.

# ఉద్యోగ సంఘాల మధ్య చిచ్చు పెడుతున్న రేవంత్ ప్రభుత్వం

- ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలకు ప్రభుత్వం దూరంగా ఉండాలి
- ప్రభుత్వం ఒక సంఘానికే వత్తాసు పలకడం తగదు
- బంగారు స్వామినాథన్ విగ్రహ ఆవిష్కరణలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఘాటైన వ్యాఖ్యలు



**విశ్వంభర, కరీంనగర్ :** ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలకు ప్రభుత్వం దూరంగా ఉండాలని, ఉద్యోగ సంఘాల మధ్య రేవంత్ రెడ్డి ప్రభుత్వం చిచ్చు పెడుతుందని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్‌లోని టీఎన్జీవోల సంఘ భవనంలో తెలంగాణ ఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షులు దివంగత బంగారు స్వామినాథన్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంకు మారం జగదీశ్వర్, టీఎన్జీవోల ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామినాథన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బంగారు స్వామినాథన్ సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మధ్య ఐక్యతను భంగపెట్టేలా ఉద్యోగ సంఘాల మధ్య చిచ్చు పెట్టి పరస్పర విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని హెచ్చరించారు. తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం ఒకే ఒక్క ఉద్యోగ సంఘాన్ని ప్రత్యేకంగా దగ్గర చేసుకుని, దానికి మాత్రమే వత్తాసు పలుకుతూ మిగిలిన ఉద్యోగ సంఘాలను నిర్లక్ష్యం చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఆయన విమర్శించారు. ఈ విధానం వల్ల ఉద్యోగుల్లో అయోమయం, అసంతృప్తి పెరిగి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల శ్రేయస్సును కాపాడడమే ఉద్యోగ సంఘాల ప్రధాన లక్ష్యమని, అలాంటి సంఘాలను ప్రభుత్వం సమానంగా గౌరవించి హక్కుల సాధనలో భరోసాగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు రెచ్చగొట్టి పక్కన నిలబడి చూస్తే టీఎన్జీవోల సంఘం ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండబోదని హెచ్చరించారు. ఉద్యోగులను కేవలం పనిముట్లుగా చూడడం, ఉద్యోగ సంఘాలను విభజన రాజకీయాలకు ఉపయోగించడం తగదని, అలా చేస్తే ప్రభుత్వానికే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీని వేదికగా చేసుకొని ఉద్యోగ సంఘాలన్నింటితో సమన్వయం పాటిస్తూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఉద్యోగుల హక్కుల సాధన విషయంలో టీఎన్జీవోల సంఘం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఉద్యోగుల గౌరవం, హక్కులు, భద్రత కోసం ముందువరుసలో నిలబడి పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.
చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బిల్లుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెలకు కనీసం రూ.1500 కోట్లను విడుదల చేస్తూ, అత్యవసర బిల్లుల క్లియరెన్స్‌కు ప్రత్యేకంగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యోగులకు రావాల్సిన సరెండర్ లీవ్ బిల్లులు, జీపీఎఫ్ బిల్లులు ఇతర అన్ని బిల్లులను సత్వరమే విడుదల చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని తెలిపారు.కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, త్వరలోనే జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన అన్ని బిల్లులను కూడా వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి ఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ, జిల్లా నాయకులు ముప్పిడి కిరణ్ కుమార్ ,రవీందర్ రెడ్డి ,నాగుల నరసింహస్వామి , గూడ ప్రభాకర్ రెడ్డి , రాగి శ్రీనివాస్ పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మహిళలపై హింస ఆగాలంటే సామాజిక మార్పు అవసరం

- జూలకంటి రంగారెడ్డి




**విశ్వంభర, హైదరాబాద్ :** భారతీయ సమాజంలో మహిళలపై హింస, లైంగిక వేధింపులు ఆగాలంటే కఠినమైన చట్టాలతో పాటు సామాజిక వ్యవస్థలో మార్పు రావాల్సిన అవసరం ఉందని ఐద్వా అఖిలభారత మహాసభల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ మహాసభలు ఈ నెల 25 నుంచి 28 వరకు హైదరాబాదులోని బాగ్లింగంపల్లి ఆర్టీసీ కళ్యాణమండపంలో జరగనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం బాగ్లింగంపల్లిలో మహాసభల ప్రచార బెలూన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ, నాలుగు రోజుల పాటు జరిగే మహాసభలకు ఐద్వా జాతీయ నాయకులు బృందాకరత్, శ్రీమతి టీచర్, మరియం ధావలే, పుణ్యవతి హాజరవుతారని చెప్పారు. మహిళా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ నెల 25న ఐస్బవన్ గ్రౌండ్‌లో బహిరంగ సభ ఉంటుందని, వేలాదిగా మహిళలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై పెరుగుతున్న లైంగిక వేధింపులు సమాజానికి సవాల్‌గా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల దురహంకార హత్యలు, అద్దె గర్భాల వ్యాపారం, మైక్రో ఫైనాన్స్ సంస్థల దోపిడీ వంటి అంశాలపై తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. ఆశాలత, ప్రజాసంఘాల నాయకులు అబ్బాస్, టీ సాగర్, భూపాల్, శ్రీరామ నాయక్, వెంకట్ రాములు, మూడు శోభన్, ఉడుత రవీందర్, కోట రమేష్, ధర్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### పండుగలు, పూర్వీకులు


## మనకు ఇచ్చిన కానుకలు : జగ్గారెడ్డి

**సంగారెడ్డి రామ్ నగర్ రామ్ మందిర్ లో సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న జగ్గారెడ్డి, నిర్మల**

**పతంగులు ఎగరవేస్తూ, చిన్ననాటి మిత్రులతో కలిసి డ్యాన్స్ చేసిన జగ్గారెడ్డి, నిర్మల**



**విశ్వంభర, సంగారెడ్డి :** సంగారెడ్డి రామ్ నగర్ రామ్ మందిర్ లో జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగా తన చిన్ననాటి మిత్రులతో కలిసి పతంగులు ఎగరవేశారు. అనంతరం పాత పాటలకు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. ఉదయం 12 గంటలకు మొదలుకుని సాయంత్రం 5 గంటల వరకు ఈ సంబరాలు కొనసాగాయి. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు మనకు పూర్వీకులు ఇచ్చిన కానుకలని, కష్టాలను, బాధలను మర్చిపోయి పండుగ రోజు అందరూ కుటుంబాలతో సంతోషంగా గడుపుతారన్నారు. సంక్రాంతి పండుగ ను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్, రామ్ మందిర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## గాదె ఇన్నయ్య ఇంట్లో విషాదం

### రెండు రోజుల గంటల బెయిల్ మంజూరు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** మావోయిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారనే ఆరోపణలతో ఇటీవల ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన తల్లి థెరిసమ్మ గురువారం రాత్రి కన్నుమూశారు. జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండలం సాగరంలోని స్వగృహంలో థెరిసమ్మ వృద్ధాప్య సమస్యల కారణంగా మరణించారు. ఇటీవల ఇన్నయ్య అరెస్ట్ కావడం, ఆయన జైలులో ఉండటంతో కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉంది. తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఇన్నయ్యకు అనుమతి ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. దీంతో తల్లి అంత్యక్రియల నిమిత్తం గాదె ఇన్నయ్యకు 48 గంటల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన శనివారం జరగనున్న అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు జైలు అధికారులకు ఆదేశాలు అందడంతో ఇన్నయ్య చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు.
గత కొద్దిరోజుల క్రితం జాఫర్‌గఢ్ మండల కేంద్రంలోని ఆయన నిర్వహిస్తున్న అనాథాశ్రమంపై ఎన్ఐఏ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి, నాలుగు వాహనాల్లో వచ్చి ఇన్నయ్యను అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి ఆయన జైలులోనే ఉంటున్నారు.

## పార్టీ ఫిరాయింపు కేసులో సుప్రీంకు బీజేపీ

**పార్టీ ఫిరాయింపు కేసులో ట్విస్ట్**

**స్పీకర్‌పై 'సుప్రీం'లో కోర్టు ధిక్కరణ పిటిషన్**

**రంగంలోకి బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత అంశం మళ్లీ సుప్రీంకోర్టుకు చేరింది. కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం జరుగుతోందంటూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ వ్యవహారం మరోసారి జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని, కానీ స్పీకర్ ఆ ఆదేశాలను ఏ మాత్రం పాటించడం లేదని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయస్థానాన్ని గౌరవించకుండా నిర్ణయాన్ని కావాలనే సాగదీస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారాన్ని ఏలేటి ప్రత్యేకంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేనేనని, ఎంపీగా కూడా పోటీ చేశానని దానం స్వయంగా ప్రకటించిన విషయాన్ని పిటిషన్‌లో ప్రస్తావించారు. పార్టీ మారినట్లు ఆయనే ఒప్పుకున్నాక అనర్హత వేటు వేయడంలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు.
ఇప్పటికే ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. ఈ పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా? లేక మమ్మల్నే తీసుకోమంటారా?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేస్తూ రెండు వారాల గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టు రిజిస్ట్రీలో పెండింగ్‌లో ఉంది. దీనికి నంబర్ కేటాయించిన తర్వాత విచారణ తేదీ ఖరారు కానుంది. ఒకవేళ సుప్రీం కోర్టు దీనిని ధిక్కరణ కేసుగా పరిగణిస్తే, స్పీకర్ కార్యాలయానికి ఇబ్బందులు తప్పవని న్యాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.




# డ్యూటీకి నో చెప్పిన పైలట్_ _ _ ప్రయాణికుల ఆగ్రహం..!!




విశ్వంభర, నేషనల్ బ్యూరో: ముంబై నుంచి థాయ్‌లాండ్‌లోని క్రాబీకి బయలుదేరాల్సిన ఇండిగో విమానంలో గురువారం ఉదయం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పైలట్ తన విధి నిర్వహణ సమయం పూర్తయిందని చెబుతూ విమానాన్ని నడపడానికి నిరాకరించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. విమానం గంటల తరబడి రన్‌వేపైనే నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వేగంగా వ్యాప్తి చెందాయి.
సమాచారం ప్రకారం, ఇండిగోకు చెందిన 6E 1085 విమానం గురువారం తెల్లవారుజామున 4:05 గంటలకు ముంబై నుంచి క్రాబీకి బయలుదేరాల్సి ఉంది. అయితే, ముందుగా రావాల్సిన మరో విమానం ఆలస్యం కావడం, ఎయిర్ ట్రాఫిక్ ఎక్కువగా ఉండటం వంటి కారణాల వల్ల ఈ ఫ్లైట్‌కు మూడు గంటలకు పైగా ఆలస్యం జరిగింది. అనంతరం ప్రయాణికులను విమానంలోకి ఎక్కించినప్పటికీ టేకాఫ్‌కు అనుమతి లభించకపోవడంతో విమానం అక్కడికక్కడే నిలిచిపోయింది.
ఇంతలో పైలట్ తన డ్యూటీ సమయం ముగిసిపోయిందని, ఇకపై విమానం నడపడం భద్రతా నిబంధనలకు విరుద్ధమని చెప్పడంతో ప్రయాణికుల ఆగ్రహం మరింత పెరిగింది. కొంతమంది సిబ్బందితో తీవ్ర వాగ్వాదానికి దిగగా, పరిస్థితి అదుపు తప్పినట్లు కనిపించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోల్లో కొందరు ప్రయాణికులు పైలట్‌ను ఉద్దేశించి ఆగ్రహంగా నినాదాలు చేయడం, విమానం ద్వారాన్ని కాలితో తన్నడం వంటి దృశ్యాలు కనిపించాయి. కొందరు అతిగా స్పందిస్తూ పైలట్‌పై దాడి చేయాలన్న వ్యాఖ్యలు చేయడం కూడా కలకలం రేపింది.
ఈ ఘటనపై ఇండిగో యాజమాన్యం అధికారికంగా స్పందించింది. భద్రతా ప్రమాణాల ప్రకారం పైలట్ డ్యూటీ సమయం పూర్తయ్యాక విమానాన్ని నడపడం సాధ్యం కాదని సంస్థ స్పష్టం చేసింది. ఆలస్యం సమయంలో ప్రయాణికులకు ఆహారం సహా అవసరమైన సదుపాయాలు అందించినట్లు తెలిపింది. అయితే, విమానంలో అనుచితంగా ప్రవర్తించిన ఇద్దరు ప్రయాణికులను భద్రతా కారణాల రీత్యా దించివేసి సంబంధిత అధికారులకు అప్పగించాల్సి వచ్చిందని పేర్కొంది. ఈ ప్రక్రియ కారణంగా ఫ్లైట్ మరింత ఆలస్యమైందని వివరించింది.
అన్ని అడ్డంకులు తొలగిన తర్వాత, ఆ విమానం చివరికి మధ్యాహ్నం 1 గంట సమయంలో థాయ్‌లాండ్‌లోని క్రాబీ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఇండిగో సంస్థ విచారం వ్యక్తం చేస్తూ, భద్రతే తమకు అత్యున్నత ప్రాధాన్యత అని మరోసారి స్పష్టం చేసింది.

# ఎస్ఐఆర్ సవరణతో లక్షలాది ఓటర్లకు నష్టం

- తెలంగాణ రాష్ట్ర సర్కారు అప్రమత్తంగా ఉండాలి
- ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తోంది
- 12 రాష్ట్రాల్లో 6.5 కోట్ల మంది ఓటు హక్కును కోల్పోయారు
- తెలంగాణ ఉద్యమకారుడు, సామాజికవేత్త హనీఫ్ అహమ్మద్



**విశ్వంభర, మహబూబ్ నగర్:** దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం 12 రాష్ట్రాల్లో చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రిజిస్ట్రేషన్ ఓటర్ జాబితా సవరణ ప్రక్రియతో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లకు నష్టం కలుగుతుందని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనీఫ్ అహమ్మద్ సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఏకపక్ష మత విధానాలతో ఇప్పటికే దేశం నుండి లక్షల మంది పౌరసత్వాన్ని వదులుకుని విదేశాలకు వెళ్తున్నారని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా ఇక్కడ ఓటు హక్కు కలిగిన పేదలు, బలహీన వర్గాలు, దళితులు, మైనార్టీలు, ఆదివాసీలకు ఓటరు జాబితా సవరణ పేరుతో ఇబ్బందులకు గురి చేసి వారి ఓటు హక్కును తొలగించాలని కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన మహబూబ్ నగర్ లో మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం అధికార బీజేపీ కి అనుకూలంగా వ్యవహరిస్తోందని అన్నారు. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇప్పటికే అనేక సాక్ష్యాధారాలతో ఈ విషయాన్ని నిరూపించారని తెలిపారు. ఇటీవల బీహార్ రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ జాబితా సవరణ ఫలితంగా 65 లక్షల మంది పేదలు బలహీన వర్గాలకు తగిన ధ్రువపత్రాలు లేవనే సాకుతో ఓటు హక్కును కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా 12 రాష్ట్రాల్లో 6.5 కోట్ల మంది తమ ఓటు హక్కును కోల్పోయారని అన్నారు. ఉత్తర ప్రదేశ్ లో రెండు కోట్ల 90 లక్షల మంది, తమిళనాడులో 98 లక్షల మంది, మధ్యప్రదేశ్లో 43 లక్షల మంది, చత్తీస్గఢ్ లో 28 లక్షల మంది, కేరళ లో 24 లక్షల మంది తమ ఓటు హక్కును కోల్పోయారని తెలిపారు. ఉత్తరప్రదేశ్ లో అత్యధికంగా రెండు కోట్ల 90 లక్షల మంది ఓటు హక్కును కోల్పోయారని ఈ సంఖ్య ఇంగ్లాండ్ దేశంలోని జనాభా కంటే ఎక్కువ అని ఆయన వివరించారు. 2003 ఓటర్ జాబితా ప్రామాణికంగా పరిగణించడంలోని ఆంతర్యమేమిటో ఎన్నికల సంఘం సమాధానం చెప్పడం లేదని విమర్శించారు. ప్రతి ఏటా నిర్వహిస్తున్న సమ్మరీ రివిజన్ సరిపోతుందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఎస్ ఐ ఆర్ ఓటర్ జాబితా సవరణ నేపథ్యంలో బిఎల్ఓ లపై తీవ్రమైన పనిభారం పడనుందని చెప్పారు. పనిభారాన్ని భరించలేక ఇప్పటికే 33 మంది బిఎల్ఓ అధికారులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనూ త్వరలో జరగనున్న ఎస్ ఐ ఆర్ ఓటర్ జాబితా సవరణ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రజాస్వామ్యవాదులు అత్యంత జాగ్రత్త వ్యవహరించాలని సూచించారు. అర్హత గల ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వినియోగించుకునేలా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

## గణితంలో ఆదుర్తి శ్రీవల్లికి పీహెచ్ డీ




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని ఆదుర్తి శ్రీవల్లి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'మైక్రోఫ్లూయిడ్ అప్లికేషన్ల కోసం మైక్రోఛానల్ లో విద్యుదయస్కాంత ప్రవాహం గణిత నమూనా, విశ్లేషణ'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోతాహర్ రెజా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ పరిశోధన మైక్రోఛానల్లలో సంక్లిష్ట ద్రవాల విద్యుదయస్కాంత హైడ్రోడైనమిక్ ప్రవాహాలపై సైద్ధాంతిక అంతర్దృష్టులను అందిస్తుందని తెలిపారు. ల్యాబ్-ఆన్-చిప్ సిస్టమ్ లు, లక్ష్య ఔషధ పంపిణీ వంటి అధునాతన మైక్రోఫ్లూయిడ్ వినియోగానికి ఇది వీలు కల్పిస్తుందన్నారు. డాక్టర్ శ్రీవల్లి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేశారు.

## కేపీఎల్ సీజన్ 5 విజేత దగ్గడ్స్ టీం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం కర్కల్పహాడ్ గ్రామంలో కేపీఎల్ సీజన్ 5 క్రికెట్ పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సీజన్లో దగ్గడ్స్ టీమ్ విజయం సాధించి మొదటి బహుమతి అందుకుంది, గ్రామ ంలో నూతనంగా ఎనికైన సర్పంచ్ తేజ చేతుల మీదుగా మొదటి బహుమతిని అందుకోవడం చాలా సంతోషంగా ఉందని క్రీడాకారులు చెప్పారు. ఈ పోటీల ఆర్గనైజర్స్ పురుషోత్తం, రఘు, రవీందర్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## చెంగిచెర్ల లో 12 ఇళ్లలో చోరీ



**విశ్వంభర, మేడిపల్లి:** మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంగిచెర్ల కాలనీలో గుర్తు తెలియని దొంగల ముఠా పలు ఇళ్లలోకి చొరబడి భారీ చోరీలకు పాల్పడింది. శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో దొంగల ముఠా చెంగిచెర్ల కాలనీలో సంచరించింది. ముందుగానే రెక్కీ చేసుకుని, కారులో వచ్చిన ఈ ముఠా దాదాపు 12 ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకుంది. వరుసగా ఇళ్లల్లో చోరీకి తెగబడ్డ దుండగులు ఆపై అక్కడి నుంచి పరారయ్యారు. తమ ఇళ్లలో దొంగతనం జరిగినట్లు గుర్తించిన బాధితులు వెంటనే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో కలిసి ఆధారాలను సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు త్వరలోనే దొంగల ముఠాను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## సురక్షిత ప్రయాణమే లక్ష్యం

**ట్రాఫిక్ ఎస్సై సాయిరాం**



**విశ్వంభర, సూర్యాపేట:** ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది పై ఉందని పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం అన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అయన అన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శుక్రవారం సూర్యాపేట పట్టణం ఆర్టీసీ డిపోలో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ డ్రైవర్ల కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, నిత్యం వందలాది మంది ప్రయాణికులతో ప్రయాణించేఆర్టీసీ బస్సు లు నడపడంలో డ్రైవర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అతివేగం, అజాగ్రత్త ప్రాణాల మీదకు తెస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమని ఎస్సై స్పష్టం చేశారు. డ్రైవర్ల చిన్నపాటి తప్పిదం ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపుతుందని అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్లు వాడకూడదని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ఆర్టీసీ సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ సైదులు నాయక్, అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్పంచ్ కు సన్మానం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ ను ఆయన సహచర పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఇంద్రపాల నగరం గ్రామ సర్పంచ్ గా అత్యధిక మెజారిటీతో గెలిచిన గర్దాస్ విక్రమ్ ను మర్యాదపూర్వకంగా కలిసి, తమతో చదివిన విద్యార్థి గ్రామ సర్పంచ్ కావడంతో సంతోషంగా ఉందని వారు ఈ సందర్భంగా అన్నారు. అనంతరం సర్పంచ్ ను సన్మానించి, పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## బర్కత్ పురలో కైట్ ఫెస్టివల్

విశ్వంభర, బర్కత్ పుర : సంక్రాంతి మన సంస్కృతికి ప్రతీక, పంట పండిన ఆనందం, ఇంటిల్లిపాదీ కలిసే సంతోషం, ప్రకృతితో మన అనుబంధం ఈ పండుగలో కనిపిస్తాయని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. గౌతమ్ రావు అన్నారు . బిజెపి సీనియర్ నాయకుడు, సెంట్రల్ జిల్లా కోశాధికారి సూర్యప్రకాశ్ సింగ్ ఆధ్వర్యంలో బర్కత్ పుర లో కైట్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## ముగ్గుల పోటీలు మహిళలల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయి

**మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య..**



**విశ్వంభర,కేసముద్రం:** కేసముద్రం పట్టణంలో మహిళలకు గత 37 సంవత్సరాలుగా ముగ్గుల పోటీ నిర్వహించడం హర్షనీయమ ని, ముగ్గుల పోటీలు మహిళలల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని నటరాజ్ కళానికేతన్ కేసముద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీ బహుమతి ప్రధానో త్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఎన్ని ఇబ్బందులు దురైనప్పటికీ నీతి నిజాయితీలను వదిలిపెట్టకుం డా జీవిస్తున్నానన్నారు. మీరు కూడా అలాగే సమస్యలకు భయపడకుం డా కష్టాన్ని నమ్ముకుని జీవించాలని అన్నారు. కేసముద్రం స్టేషన్ మాజీ సర్పంచ్ అల్లం రమ నాగేశ్వరరావు మాట్లాడు తూ, మహిళలలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి ముగ్గుల పోటీలు దోహదపడతా యని అన్నారు. మహబూబాబాద్ జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు మాట్లాడుతూ, మనం మార్కెట్లో వస్తువు కొనేటప్పుడు మోసపో కూడదన్నారు. ప్రతి డబ్బాపై ఉండే ఎమ్మార్పీ తదితర అంశాలు పరిశీలించాలన్నారు. అనంతరం ముఖ్య అతిథులు గుమ్మడి నరసయ్య, అల్లం రమ నాగేశ్వరరావు, మైస శ్రీనివాసులు చేతుల మీదుగా ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నటరాజ కళానికేతన్ అధ్యక్షులు చీకటి వెంకట్రాశీ నరసయ్య, ఉపాధ్యక్షులు నాగనబోయిన వెంకటేశ్వర్లు,కోశాధికారి కుర్న హరినాథ్, వేల్పుల రేవంత్, రేణిగుంట సుధాకర్, శీలం సత్యనారా యణ, జక్కుల కృష్ణమూర్తి, గొల్లపల్లి రాజేష్, మహమ్మద్ రఫీ, కందుకూరి రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు. .

### ముగ్గుల పోటీ విజేతలు వీరే

పెద్ద బజార్ లో నిర్వహించిన ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి నాగనబోయిన సృష్టి యాదవ్, ద్వితీయ బహుమతి కస్తూరి శివాని, తృతీయ బహుమతి భూక్య అనూష గెలుచుకున్నారు. మార్కెట్ బజార్ లో నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి శివరాత్రి శ్రీలక్ష్మి, ద్వితీయ బహుమతి రామగిరి భాగ్యలక్ష్మి, తృతీయ బహుమతి అర్వపల్లి జయశ్రీ గెలుపొందారు. కిష్టాపురంలో ప్రథమ బహుమతి మామిడి శెట్టి సౌజన్య, ద్వితీయ బహుమతి వేల్పుల తేజశ్రీ, తృతీయ బహుమతి ఆగే రమ్య గెలుపొందారు. లక్ష్మీ నగర్లో నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి పిడుగు అఖిల, ద్వితీయ బహుమతి సింగంశెట్టి ప్రియాంక, తృతీయ బహుమతి రేణిగుంట్ల హరిణి గెలుపొందారు.

## సమాజాన్ని మలిచే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే

**ఎమ్మెల్యే వెంకట్రావు రావు**



**విశ్వంభర, భద్రాచలం:** సమాజాన్నిమలిచే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని భద్రాచలం శాసనసభ్యులు వెంకట్రావు రావు అన్నారు. ప్రగతిశీల గ్రామీణ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉపాధ్యాయుల వృత్తి బాధ్యతలు, హక్కులు, సంక్షేమ అంశాలను ఒకే చోట పొందుపరిచేలా రూపొందించిన ఈ డైరీ వారికి ఎంతో ఉపయోగప డుతుందని అన్నారు. ప్రభుత్వం తీసుకు వస్తున్న విద్యా సంస్కరణలు, ఉపాధ్యాయుల సంక్షేమానికి సంబంధించిన పథకాలు, విధానాల అమలులో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన చెప్పారు. అనంతరం పి ఆర్ టి యూ జిల్లా అధ్యక్షులు పూణెం నరసయ్య మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు అవసరమైన నిబంధనలు, సెలవుల వివరాలు, విద్యా చట్టాలు, సంఘ కార్యకలాపాల సమాచారం ఈ డైరీలో పొందుపరిచామని చెప్పారు. ఇది ప్రతి ఉపాధ్యాయునికి ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కారంపూడి దశమ్ బాబు మాట్లాడుతూ, పి ఆర్ టి యూ ఎల్లప్పుడూ ఉపా ధ్యాయుల హక్కుల పరిరక్షణకు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పూణెం నరసయ్య గారు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కారంపూడి దశమ్ బాబు గారు, దుమ్మగూడెం మండల అధ్యక్షులు దగ్గుపల్లి శ్రీనివాసరావు గారు, మండల ప్రధాన కార్యదర్శి బోళ్ల మల్లికార్జునరావు గారు ముఖ్యంగా పాల్గొన్నారు. అలాగే వి. మంగయ్య, ఎల్. శివ, ఎం. సత్యదాస్, పసుపులేటి శ్రీనివాసరావు తదితర ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## విశ్వకర్మ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**విశ్వంభర, అంబర్‌పేట:** విశ్వకర్మ సోదరులు చైతన్యంగా ఉండి అన్ని రంగాలలో రాణించే విధంగా యువతను భావితరాలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గ శ్రీ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం చైర్మన్ నాగారం భాస్కరాచారి, అధ్యక్షుడు గొట్టాల వినోద్ కుమార్ చారి, ప్రధాన కార్యదర్శి పోలోజు వేణుగోపాల్ చారి, కోశాధికారి ఉల్లెంగుల కృష్ణమాచారి, ముఖ్య సలహాదారులు పడుకంటి అంజయ్య చారి, శ్రీరాందాస్ సంజీవ చారి, పులిమామిడి శ్రీహరి చారి, మేడ్చల్ సంపత్ కుమార్ చారి, ఎల్లయ్య చారి పాల్గొన్నారు. అలాగే సభ్యులు రవీందర్ కుమార్, శ్రీనివాస్ రాజు, కృష్ణాచారి, శ్రీరామ్ చారి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి

**విశ్వంభర, నారాయణగూడ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద జరిగిన నిరసనలో ఈ పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ బిల్లు, విత్తన చట్టం, 'వికసిత్ భారత్--జి రామ్ జీ' బిల్లును ఉపసంహరించాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నల్లజెండాలతో నిరసనలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగర్ , పశ్య పద్మ , వెంకటేష్ భూపాల్, వంగూరు రాములు, ఈశ్వర్ రావు, బొప్పని పద్మ, శంకర్ , శోభన్, శ్రీరామ్ నాయక్, ధర్మానాయక్, కోట రమేష్, ఎం వెంకటేష్, యం దశరథ్, తదితరులు పాల్గొన్నారు.




## అంబేద్కర్ చిత్రపటాల బహూకరణ



**విశ్వంభర,ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి ఎస్సై గంగారపు కరుణాకర్, సర్పంచి తమ్మడపల్లి కుమార్ లకు భారతరత్న అంబేద్కర్ చిత్రపటాలను అదే గ్రామానికి చెందిన నాటక కళాకారుడు, ఫోక్ సింగర్, అంబేద్కర్ భావజాల వ్యాప్తికుడు పసునూరి జంపయ్య బహూకరించాడు. సంక్రాంతి పురస్కరించుకొని శుక్రవారం పోలీస్ స్టేషన్ తో పాటు, గ్రామపంచాయతీకి ఎస్సై, సర్పంచి లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి బాబా సాహెబ్ చిత్ర పటాలను అందజేశారు. ఈ సందర్భంగా జంపయ్య మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత, దార్శనికుడు, బాల్యం నుంచే అస్పృశ్యత పై పోరాడి ఎదిరించిన భీమ్ రావు చిత్రాలను ముఖ్యమైన కార్యాలయాలకు అందజేయడం సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బూర ఇస్తారి, గోపందాస్ కృష్ణ, దిశ కమిటీ సభ్యులు బాబురావు,పప్పుల వెంకన్న, చిన్నాల కట్టయ్య,బేతమల్ల చంద్రయ్య,సలీం రామ్,ఉమ్మగాని మధు, శ్రీకాంత్, వినయ్, నగేష్, జానీ, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, నాగారం:** నాగారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 2006--2007 ఎస్ఎస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్న విద్యార్థులు పాఠశాల రోజులను, ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో ఎదురైన అనుభవాలను, ప్రస్తుతం వారు వివిధ రంగాల్లో సాధిస్తున్న విజయాలను పరస్పరం పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి, ప్రస్తుత విద్యార్థులకు సహకారం అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగించాలని నిర్ణయించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య స్నేహ బంధాలను మరింత బలోపేతం చేసింది.

## నాగారంలో అరైవ్ అండ్ అలైవ్

**విశ్వంభర, నాగారం :** రోడ్డు ప్రమాదాల వల్ల ఏ ఒక్కరూ మరణించకూడదనే ఉద్దేశంతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నాగారం ఎస్సై చిరంజీవి తెలిపారు. మండల పరిధిలో స్థానిక హెల్త్ సెంటర్ ఎంఆర్ఓ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులకు రోడ్డు భద్రత పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి మట్లాడుతూ , ప్రయాణ సమయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. ఉద్యోగులు దీని పట్ల బాధ్యతగా ఉండాలని కోరారు. అరైవ్ అలైవ్ లో భాగంగా ప్రతి ఒక్కరూ సురక్షిత గమ్యం చేరుకోవడమే నినాదంగా మండల వ్యాప్తంగా రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలునిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు, డిఫెన్స్ డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు, రోడ్డును సక్రమంగా వినియోగిస్తూ క్రమ పద్ధతిలో వాహనాలు నడపాలని ఎనక ముందు వచ్చే వారికి ఇబ్బంది కలిగించకూడదని ముందస్తుగా ఇండికేట్ చేస్తూ ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ హరి కిషోర్ శర్మ, డాక్టర్ నాగరాజు, పోలీస్ సిబ్బంది రవీందర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.





## టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్కు శుభాకాంక్షలు

**విశ్వంభర, బషీర్ బాగ్ :** భోగి, సంక్రాంతి, కనుమ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్కుమార్ కు ఫోరమ్ వైస్ ప్రెసిడెంట్ ముజాహిద్, జాయింట్ సెక్రటరీ సుదర్శన్, ప్రచార కార్యదర్శి అరుణ జ్యోతి, ప్రియదేవ్ ఠాకూర్ లు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించాబు. ఈ ఈ కార్యక్రమంలో రాజేందర్, రాజశేఖర్, అన్వర్ ఖాసిం , మంజు, బషీర్, శేషిరత్న, రేణుక, వల్లీస్వరూప, రమాకాంత్, శ్రీనివాస్, దేవిప్రసాద్ మీర్జా, రమేష్, రవీందర్, రియాజ్, కిరణ్, అనిల్ లక్మ, గౌసియా, పరమేష్, శ్రీకాంత్, పవన్, శ్రీనివాస్, మధు, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## నేడే సికింద్రాబాద్ బచావో ర్యాలీ



**విశ్వంభర, సికింద్రాబాద్ :** సికింద్రాబాద్ పేరును మార్చే యత్నాలను తిప్పికొట్టాలని బీఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. ముషీరాబాదులో జరిగిన బీఆర్ఎస్ విస్తృత సమావేశంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, సుదీర్ఘ చరిత్ర ఉన్న సికింద్రాబాద్ అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను సహించబోమన్నారు. పేరుమార్పు ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం ఈ విధమైన చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఈ నెల 17న నిర్వహించనున్న సికింద్రాబాద్ బచావో ర్యాలీలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, హరిబాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ పతంగుల పంపిణీ



**విశ్వంభర, హైదరాబాద్ :** పండుగలు సమాజంలో ఐక్యతను పెంచుతా యని, ప్రజా ప్రతినిధులు పండుగల సమయంలో ప్రజల మధ్య ఉండాల్సిన అవసరం ఉందని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగరంలో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో పలుచోట్ల విద్యార్థులకు గాలిపటాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగలను శాంతి యుతంగా, ఆనందంగా జరుపుకోవాలని, ఎలాంటి అనుకోని సంఘట నలు జరగకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్ర మంలో శ్రీనివాస్, రామకృష్ణ, లాలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఓటర్ల జాబితా



**విశ్వంభర, సూర్యాపేట:** మున్సిపల్ సాధారణ ఎన్నికల సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వారీగా తయారుచేసిన తుది ఓటర్ల జాబితాను ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచినట్లు మున్సిపల్ ఇఇ కిరణ్ తెలిపారు. ఈ జాబితాలు జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఆర్డీవ, ఎంఆర్ఓ కార్యాలయాల్లోనూ ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో , మేనేజర్ బుచ్చి బాబు,టిపిఒ సోమయ్య ,ఆర్వో కళ్యాణి, సీనియర్ అస్సిటెంట్ నాగయ్య ,బిఐ అఖిల్ ,జూనియర్ అస్సిటెంట్లు యం.డి.గౌసుద్దీన్, ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్ ,వీరాస్వామి,శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి

### డిఎస్పీ ప్రసన్న కుమార్

**విశ్వంభర, సూర్యాపేట:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రోడ్డు భద్రత మహెూత్సవాలు, పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్ అ లైవ్ కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు ఈరోజు సూర్యపేట పట్టణ మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల వల్ల ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు, రోడ్డు భద్రత పట్ల సామాన్య ప్రజలను పౌరులను యువతను ప్రభుత్వ



ఉద్యోగులు ప్రభావితం చేయాలని అవగాహన కల్పించాలని కోరారు. ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉన్నదని అన్నారు. ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడప వద్దని, హై స్పీడ్ తో వాహనాలు నడప రాదని తెలిపారు. పిల్లలకు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదని సూచించారు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత కార్యక్రమాల్లో ఉద్యోగులు, పౌరులు భాగస్వామ్యం కావాలని కోరారు. రోడ్డు భద్రత పట్ల నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాద రహితంగా వాహనాలు నడుపుతామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎంఈఓ శ్రీనివాస్, ఆర్ ఎం ఓ లక్ష్మణ్, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, టౌన్ ఎస్ఐ లు మహేంద్ర నాథ్, శివ తేజ, ఐలయ్య, ఏఎంవిఐ విక్రమ్, ఏ ఎం వి ఐ సంపత్ పాల్గొన్నారు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



- రోడ్డు భద్రత మాసో త్సవాల్లో సీఐ మహేందర్ రెడ్డి

**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్, రవాణా శాఖ సంయుక్త, ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ శబరీష్ పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత మాసో త్సవాలు నిర్వహిస్తున్నట్లు సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ నిబంధన పై ప్రతి ఒక్కరిలో అవగాహన కార్యక్రమాలు, ప్రచారం నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. అందులో భాగంగానే ఈరోజు కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేమం ఒకటే కాదు ట్రాఫిక్ రూల్స్ నిబంధనలు ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అందరూ పక్కాగా పాటిస్తూ ఎదుటి వారికి కూడా పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు, ఉద్యోగానికి లేదా ఇతర ప్రయాణాలు చేసే ముందు వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, కలెక్టరేట్లో అన్ని విభాగాల శాఖ అధికారులు వారి వారి క్షేత్రస్థాయి సిబ్బంది అందరికీ ప్రత్యేక సర్కులర్ జారీ చేసి నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని , నో పార్కింగ్ జోన్ లో వాహనాలు పార్కింగ్ చేయకూడదని, ట్రాఫిక్ సిగ్నల్స్ , రోడ్డు భద్రత సింబల్స్ నిషితంగా పరిశీలించి వాహనం నడపాలని, అతివేగంతో ప్రయాణం చేయకూడదని చెప్పారు. పాదచారులు రోడ్డు దాటే క్రమంలో నిబంధనలు పాటించాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ నిబంధనలపై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీ రామ్ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి జి. మరియన్న, డిపిఆర్ఓ పి. రాజేంద్రప్రసాద్, మందుల శ్రీరాములు, వెంకటేశ్వర్లు, సంతోష్, తదితరులు మాట్లాడారు, ఈ సందర్భంగా క్షేమంగా చేరుకోండి... క్షేమంగా జీవించండి... అనే పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, ఎస్ఐలు అరుణ్ కుమార్, ప్రశాంత్, కలెక్టరేట్ సిబ్బంది ఏ.రవీందర్, నరేష్ రెడ్డి, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో అనుమతులు జారీ చేయాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**విశ్వంభర, సూర్యాపేట:** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వి సి హాల్ లో శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ, టి.జి.ఐపాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల గురించి కలెక్టర్ సమీక్షించారు. 49 పరిశ్రమలకు గాను 119 అప్రూవల్స్ వివిధ శాఖల ద్వారా వచ్చాయని వాటిని అధికారులు క్షేత్ర స్థాయి లో పరిశీలించి సంబంధిత అధికారులు నిబంధనల మేరకు సకాలంలో ఆమోదించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో టి ప్రైడ్ పథకం కింద 143 మంది లబ్ధిదారులకు రాయితీ మంజూరు చేయడం జరిగిందని, జిల్లాలోని రైసుమిల్లులు, ఫార్మా అలాగే సిమెంట్ పరిశ్రమలు భద్రతా నిబంధనలు, తీసుకుంటున్న జాగ్రత్తలపై త్వరలో అధికారులతో యాజమాన్యంతో సమావేశం ర్వహించవల సిందిగా ఆయన ఆదేశించారు. ఈ సమావేశం లో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి. సీతారాం, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బి. యాదగిరి, డి.పి.ఓ. యాదగిరి , ఆర్ టి ఓ జయ ప్రకాష్ రెడ్డి, యస్.సి డెవలప్మెంట్ అధికారి దయానంద రాణి, యస్. టి డెవలప్మెంట్ అధికారి కె. శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




## అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా జిహెచ్ఎంసి పరిధిలోని ఎదులాబాద్ ఘట్కేసర్, పోచారం వార్డులలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఇళ్ల ముంగిళ్లలో యువతులు రంగురంగుల ముగ్గులు వేవగా యువకులు ఉత్సాహభరితంగా పతంగుల ఎగురవేసి సంబరాలకు మరింత జోష్ తెచ్చారు మధ్య మధ్యలో పిండివంటలు ఆరగిస్తూ డీజే పాటల నడుమ రంగురంగుల పతంగులను ఎగురవేస్తూ కేరింతలతో పండుగ వాతావరణాన్ని హెూరెత్తించారు. సంప్రదాయం, ఆనందం సమ్మేళనంగా సాగిన ఈ వేడుకలు శోభాయమానంగా జరిగాయి.

## కేటీఆర్ కు మహేష్ శుభాకాంక్షలు




**విశ్వంభర, హైదరాబాద్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఇద్దగిరి మహేష్ మాజీ మంత్రి కేటీఆర్ ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో యువకులకు ఎక్కువ టికెట్లు కేటాయించి ప్రోత్సహించాలని కోరారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం గంగారం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేశ్వరం సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, యూత్ కు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. లైసెన్స్ లేకపోయినా, త్రిబుల్ డ్రైవింగ్ చేసినా , హెల్మెట్ లేకుండా ప్రయాణం చేసినా ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించినా కఠిన చర్యలుంటాయని చెప్పారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దేవేందర్ నాయక్, ఉప సర్పంచ్ మహేందర్, మోహన్, రవి, శ్రీనివాస్, మల్లేష్, యాదయ్య, బాలరాజ్, పర్వతాలు, వివిధ గ్రామాల క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత
## ముగ్గురు అరెస్ట్, ఒకరు పరారీ

**విశ్వంభర, హైదరాబాద్ :** సంగారెడ్డి బైపాస్ రోడ్డులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్టీఎఫ్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో 1.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రజా, హుస్సేన్ వికాస్ అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. మూడో నిందితుడు షేక్ పరారీలో ఉన్నట్లు ఎస్టీఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. ఇదే సమయంలో సికింద్రాబాదు ప్రాంతంలోని మంగరి బస్తీ--లాల్గూడ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మహిళ నుంచి 380 గ్రాముల గంజాయిని ఎస్టీఎఫ్--సీఎఫ్సీ టీం స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో మీరాబాయిని అరెస్ట్ చేసి సికింద్రాబాదు ఎక్సైజ్ స్టేషన్కు అప్పగించినట్లు ఎస్సై మంజు తెలిపారు.



# మహాధర్నాను విజయవంతం చేయండి

**విశ్వంభర, హైదరాబాద్ :** వికలాంగుల మహా ధర్నాను విజయవంతం చేయాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో--కన్వీనర్ కాటమోని వెంకటేష్ గౌడ్ కోరారు. బాగ్ లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ నెల 21న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న వికలాంగుల మహా ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ చేయూత పెన్షన్ పెంచి ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిన వికలాంగుల న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 21న తలపెట్టిన మహా ధర్నాను వికలాంగులు, వృద్ధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఏ ఉద్దీన్, సయ్యద్ అహ్మద్, ఆజాం తదితరులు పాల్గొన్నారు.



# కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

## కార్మిక నాయకుల పిలుపు



**విశ్వంభర, రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ వ్యతిరేక విధానాలపై ప్రజలు ఉద్యమించాలని వ్య.కా.స, రైతు సంఘం, సిఐటియు జిల్లా కార్యదర్శులు కొండమడుగు నర్సింహ్మా, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్, విబిజి రాంజి చట్టం , జాతీయ విత్తన, విద్యుత్ సవరణ బిల్లుల రద్దుకై జరిగే దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మూడు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక కర్షక యాత్ర శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సుభాష్ కేంద్రంలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలుగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాయడమే కాక రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసిందని అన్నారు. ఓవైపు ప్రజా సంక్షేమం వల్లిస్తూనే పాలనలో కార్పోరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల రాయితీ ఇచ్చిందని, చివరికి ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నదని, అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్ లను అమలు, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లు, విబిజి రామ్ జి చట్టం, బీమా రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి ఇస్తూ ప్రజలపై పెనుబారం మోపుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబించే కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వ్య.కా.స. జిల్లా ఉపాధ్యాక్షులు జల్లెల పెంటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు గొరిగె సోములు, జిల్లా నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గన్నెబోయిన విజయ్ భాస్కర్, బోయిన ఆనంద్, ఐలు జిల్లా కార్యదర్శి మామిడి వెంకటరెడ్డి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నకిరేకంటి రాము, ఎన్.పి.ఆర్.డి జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు వంగాల మారయ్య, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంటపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, నరసింహ, బల్గురి అంజయ్య, బావండ్లపల్లి బాలరాజు, అప్పం సురేందర్, నాగటి ఉపేందర్, మునుకుంట్ల లెనిన్, శ్రవణ్ కుమార్, పుట్టల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాచిగూడలో ముగ్గుల పోటీలు

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ ఆదేశాల మేరకు రోడ్డుభద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నగరంలోని పలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రోడ్ సేఫ్టీ క్యాంపెయిన్ కింద కాచిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తులసీనగర్, లంక, గోల్నాక ప్రాంతాల్లో ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 100 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీ అనంతరం విజేతలకు, అలాగే పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంచడమే లక్ష్యమని ట్రాఫిక్ అధికారులు తెలిపారు.

# 20న విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్‌డే

**విశ్వంభర, సిద్దిపేట:** విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న విద్యుత్ భవన్ లో ఈనెల 20న కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెసెల్ ఫోరం హైదరాబాద్ ఆధ్వర్యంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని సిద్దిపేట డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ కె.రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి హాజరయ్యేవారు కరెంట్ బిల్లు రసీదు, ఆధార్ కార్డు తీసుకుని రాగలరని తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని చెప్పారు. సిద్దిపేట డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మహారాష్ట్ర ఎన్నికల విజయంతో బీజేపీ సంబరాలు



**విశ్వంభర, హైదరాబాద్ :** ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సాధించిన చారిత్రక విజయాన్ని హైదరాబాదు నాంపల్లి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వఅబశ్రీశ్రీహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఈ విజయం రాబోయే జిహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ప్రతిధ్వనిస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, గౌతమ్ రావు, వేముల అశోక్, వీరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్లకు అరైవ్-అలైవ్ పై అవగాహన



**విశ్వంభర, సిద్దిపేట :** ఆర్టీసీ బస్ డిపో డ్రైవర్లకు అరైవ్-అలైవ్ రోడ్డు సేఫ్టీ ప్రోగ్రాంలో భాగంగా సీపీ రేష్మి పెరుమాల్ ఆదేశాల మేరకు శుక్రవారం ట్రైనీ ఐపీఎస్ ఫాతిమా, ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, వన్ టౌన్ సీఐ వాసుదేవరావు, టూ టౌన్ సీఐ ఉపేందర్, ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్, డ్రైవింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ భవభూతి, డిపో సిబ్బంది, ఆర్టీసీ డ్రైవర్స్ పాల్గొన్నారు.



# క్రికెట్, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల అందజేత

**విశ్వంభర, అమనగల్:** మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో క్రికెట్ పోటీలు, 6వ వార్డ్ లో గుర్రం గుట్ట కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆమనగల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు , గిరిజన నాయకులు నేనావత్ పత్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో గుర్రం గుట్ట కాలనీ చెందిన 200 మంది మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొన్నారు. క్రికెట్ పోటీలలో 50 వేల నగదు బహుమతిని విజేతలకు అందజేశారు. ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్క సంక్రాంతి పండుగ కానుకగా పట్టుచీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరికుప్పల గణేష్, దేరంగుల వెంకటేష్, కొమ్ము ప్రసాద్, వస్పూల జంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ గణేష్ నాయక్, రేపని శివ, గుగ్గిళ్ళ అంజి, విమలమ్మ, లలిత స్పందన, జ్యోతి, అండాలు, రాకేష్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు, పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతులు ప్రదానం



**విశ్వంభర, ఇనుగుర్తి :** మండల కేంద్రం ఇనుగుర్తిలో సంక్రాంతి పురస్కరించుకుని నిర్వహించిన ముగ్గులు పోటీలలోని విజేతలకు స్థానిక ఎస్సై గంగారపు కరుణాకర్, సర్పంచ్ తమ్మడపల్లి కుమార్ ల చేతుల మీదుగా బహుమతులు శుక్రవారం అందజేశారు. దాతలు వార్డు సభ్యులు వేముల శ్రీనివాస్,నద్దునూరి ప్రశాంత్, చిన్నాల పరశు రాములు,గాడుదుల సరిత, ఎండి రహీం,ఎం సి డైరెక్టర్ కొట్టం రాము,విజయలక్ష్మి సిమెంట్ ఐరన్ షాపు ప్రోప్రైటర్ కొట్టం చరణ్,పెండ్లి మహేందర్, అయ్యప్ప బైక్ జోన్ సుంకనపల్లి రాకేష్ సహకారంతో పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి వద్దిరాజు రజిత,ద్వితీయ మామిళ్ల ప్రియాంక,తృతీయ బోళ్ళ ఉషశ్రీ,చతుర్ధ ముల్క భవాని,పంచమ ప్రసన్న తో పాటు మరో 40 మందికి ప్రైజులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్తూరి యాదగిరి,దిశా సభ్యులు బాబురావు,దార్ల రామ్మూర్తి,గంజి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎమ్మార్వో కు వినతి పత్రం




**విశ్వంభర, చిట్యాల:** మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు చట్టభద్రతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని నల్గొండ జిల్లా, చిట్యాల మండల తహసిల్దార్ విజయకు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ వినతిపత్రం అందజేశారు. అనంతరం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, ఎడ్ల మహలింగం మాట్లాడుతూ, ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని కోరారు. జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల, మున్సిపల్ రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించడానికి రాజ్యాంగ సవరణ చేయాలని, బీసీలు ఈ రాష్ట్రంలో రాజకీయంగా 14శాతం కూడా దాటలేదంటే రాజకీయంగా ఎంత వెనుక బడ్డారో అర్థం చేసుకోవచ్చని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ ఇచ్చిందని, కావున అసెంబ్లీలో చట్టం చేశారని జీవో తీసి వెంటనే ఎన్నికలకు వెళ్లాలని అన్నారు. , అలాగే సుప్రీంకోర్టు అగ్ర కులాలకు 10శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు 50 శాతం సీలింగ్ ఎత్తివేసిందని, పైగా ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50శాతం సీలింగ్ ను అధిగమించవచ్చునని సుప్రీంకోర్టు తీర్పు కూడా ఉన్నదని పేర్కొన్నారు. ఇప్పుడు అన్ని కోణాల్లో చూస్తే కేసు గెలిచే అవకాశం ఉందని, చట్ట ప్రకారము, న్యాయం ప్రకారము రాజ్యాంగపరమైన అవరోధాలు లేవు కావున చివరకు సుప్రీంకోర్టులో కేసు గెలుస్తుందని చెప్పారు. రిజర్వేషన్లు పెంచడానికి న్యాయపరమైన చట్టపరమైన రాజ్యాంగపరమైన అవరోధాలు ఏమీ లేవని, కేసు బలంగా ఉందని అన్నారు. రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారని, అసెంబ్లీలో చట్టం కూడా చేశారని, ఈ కేసు రాజ్యాంగ పరంగా బలంగా ఉందని, రాజ్యంగంలోని 243-డి-6 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి బీసీ రిజర్వేషన్లను నిర్ణయించే అధికారం ఉందని, దీని ప్రకారం జీవో జారీ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీ రాందేవ్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, మనీల్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు




**విశ్వంభర, సిద్దిపేట :** ఎరుకల కులస్తుల స్ఫూర్తి ప్రదాత ఏకలవ్యుడి విగ్రహ ఏర్పాటుకు పట్టణానికి చెందిన ఎరుకల సంఘం నాయకులు రాజకీయాలకతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని ఏకలవ్య ఎరుకల సంఘం అధ్యక్షుడు రాజేష్ ఖన్నా అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పశువుల ఆస్పత్రి సమీపంలోగల చౌరస్తా వద్ద ఏకలవ్య విగ్రహ ఏర్పాటుకు అనుకూలమైన స్థలంలో గురువారం సంఘ సభ్యులతో కలిసి ఏకలవ్య చిత్రపటాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పట్టణ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏకలవ్య సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ నర్సింలు, మాజీ అధ్యక్షుడు పోచయ్య, మాజీ కౌన్సిలర్ దుర్గయ్య, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సంతోష్, బీఆర్ఎస్ నాయకులు శ్రావణ్, రాజేందర్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కెమ్మసారం శ్రీనివాస్, అరుణ, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించిన ఎస్సై సుస్మిత







**విశ్వంభర, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కేంద్రంలో అరెల్వ్ అల్లువ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం. నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం మోపాల్ గ్రామపంచాయతీ వద్ద రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు సిబ్బంది హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యత వివరించిన వివరించి వాహనాల పార్కింగ్ సూచన చేశారు ప్రతి వాహనం క్యాంపింగ్ స్టిక్కర్లు అతికించారు రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ నిర్వహించి ఎస్సై సుస్మిత, సిబ్బందితో కలిసి పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న చర్యను గ్రామీణ ప్రజలు తిప్పి కొట్టాలి



**విశ్వంభర, రామన్నపేట :** పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రను గ్రామీణ ప్రజలు తిప్పి కొట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, జనంపల్లి గ్రామంలోని గ్రామశాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాలపై భారాన్ని మోపుతూ కేంద్ర ప్రభుత్వ బాధ్యత నుండి తప్పుకునే ప్రయత్నం చేస్తూ పేరును సైతం మార్చే కుట్ర చేస్తుందని అన్నారు. గ్రామాల్లో పేదలు వ్యవసాయ కూలీలకు కాస్త ఉపాధి, ఆర్థిక వెసులుబాటు, ఆత్మ గౌరవం కలుగుతుందని ఉపాధి హామీ చట్టాన్ని రూపు మాపేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి కుట్రను తిప్పి కొట్టాలని అన్నారు. మాజీ ఎంపిటిసి వేమవరపు సుధీర్ బాబు మాట్లాడుతూ, సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, గ్రా శాఖ కార్యదర్శి పులి బిక్షమయ్య, నాయకులు పండుగ రాజమల్లు, సంగిశెట్టి మార్కండేయ, మాజీ సర్పంచి రాచమల్ల పర్వతాలు, అక్కెనపల్లి వీరయ్య, వార్డు సభ్యులు పండుగ రజిత, అక్కెనపల్లి కలమ్మ, సంగిశెట్టి శివాజీ, అక్కెనపల్లి శివ, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు కందుల హనుమంతు, సిఐటియు మండల నాయకులు వంగాల మారయ్య, దేశపాక రవి, శ్రీకృష్ణ, పుట్టల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



## గాజులరామారం మున్సిపల్ ఆఫీసులో జీహెచ్ఎంసీ సిబ్బందికి ప్రమాదాలపై అవగాహన

**విశ్వంభర, కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకున్నటువంటి ూశ్రీఱజవ - ూతీతీఱజవ అనే ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం గాజులరామారం మున్సిపల్ ఆఫీస్ లో రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం డిప్యూటీ కమిషనర్ జి,హెచ్ఎం,సి, మల్లారెడ్డి,అడిషనల్ డీసీపీ కుత్బుల్లాపూర్ జోన్ పురుషోత్తం,జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్ డి,ఐ, ధనుంజయ్ జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ కి అవగాహన, ప్రమాదాలు ఏ విధంగా జరుగుతాయి వాటినుండి మనం ఎలా రక్షించుకోవాలి ట్రాఫిక్ రూల్స్ పాటించిన ప్రమాదాల నుండి కాపాడుకోవచ్చని తెలిపారు. రోడ్ సేఫ్టీ పై అవఅబశ్రీశ్రీగాహఅబశ్రీశ్రీనఅబశ్రీశ్రీ కలిపించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విభాగాలలో రోడ్ సేఫ్టీ అవగాహన కల్పించడం అనేది రెండో రోజు కార్యక్రమం దీంట్లో భాగంగా ఈ యొక్క కార్యక్రమం ఏర్పాటు చేశారు.




## అనాధ వృద్ధులు, వికలాంగులను ఆదుకోవాలి

### చిట్టబోయిన నందకిషోర్ యాదవ్

**విశ్వంభర, హైదరాబాద్ :** అనాధ వృద్ధులు, వికలాంగులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిట్టబోయిన నందకిషోర్ యాదవ్ పిలుపునిచ్చారు. భారతి మెమోరియల్ ఫౌండేషన్ ఆశ్రమాన్ని సందర్శించిన ఆయన నిత్యావసర సరుకులు అందజేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో చేరేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా గో గ్రామ శోభాయాత్ర

**విశ్వంభర, తొర్రూరు :** మన హైందవ సాంప్రదాయంలో ఉన్న ప్రతి ప్రాణి పూజనీయమే. సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కనుమ పండుగ పురస్కరించుకొని పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి గోశాల ఆధ్వర్యంలో రైతుల కు పాడిపంటలను ఇచ్చే పశువులను కూడా సాంకేతికత వృద్ధి చెందని నాటి కాలంలో రైతులు తమ వ్యవసాయానికి ఆధారమైన వృషభాలను ,పాడినిచ్చే గోమాతలను ప్రత్యేకంగా అలంకరించి పూజించేవారు, రాను రాను పశుసంపద కరువై పండగలు అంటే నేటి ఈ కాలపు పిల్లలకు ఏంటో తెలియని పరిస్థితి ఉన్న ఈ కాలంలో డివిజన్ కేంద్రం తొర్రూర్ లో గోశాల వారి ఆధ్వర్యంలో గోమాతలను పట్టణంలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. దారం కుమారస్వామి తన బైక్ పై సౌండ్ సిస్టంతో పట్టణంలో వివిధ వీధుల్లో గోమాత ప్రశస్త్యాన్ని తెలిపే విధంగా గోమాత పాటలతోపాటు గో శోభాయాత్ర జరుగుతుందని తెలియజేశారు. ఈ శోభాయాత్ర గోశాల అమ్మపురం రోడ్డు నుండి బయలుదేరి పురవీధులలో తిరుగుతూ బస్టాండ్ సెంటర్ మీదుగా తిరిగి గోశాలకు చేరుకున్నాయి ఈ శోభాయాత్రలో గో ప్రేమికులు గోశాలకు సహకరించేవారు పాల్గొన్నారు.



## మాయావతి బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక



**విశ్వంభర, సిద్దిపేట :** బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక మాయావతి అని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల కోసం పోరాడే ఏకైక పార్టీ బీఎస్పీ మాత్రమేనని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ పేర్కొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి 70వ జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ దగ్గర ఘనంగా నిర్వహించారు. మొదటగా మహాత్మ జ్యోతిభాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ అగ్రవర్ణ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ మెడలు వంచి ఉత్తరప్రదేశ్ లో నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన ఘనత మాయవతికే దక్కుతుందని చెప్పారు. పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కాన్సీరాం ఆశయాలను ముందుకు తీసుకపోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మాయావతిని ప్రధానిని చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎనగందుల వెంకన్న, జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కుంట శ్రీనివాస్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షుడు రవీందర్ నాయక్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మోహన్, మెదక్ జిల్లా అధ్యక్షుడు దాస్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు హరిలాల్ నాయక్, బీఎస్పీ సీనియర్ నాయకులు అంకని భాను పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ తిరుగు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి

- అవసరమైన చోట వాహనాల దారి మళ్లింపు
- ప్రయాణంలో విశ్రాంతి తీసుకుని ముందుకు సాగాలి
- కె.నరసింహ ఐపిఎస్

**విశ్వంభర, సూర్యాపేట:** సంక్రాంతి పండగ జరుపుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం హైదరాబాద్ కు వచ్చే తిరుగు ప్రయాణంలో వాహనదారులు, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ అన్నారు. పండగ పూర్తి చేసుకొని ఒకే సారి హైదరాబాద్ నగరానికి భారీగా వాహనాలు వచ్చే నేపథ్యంలో, నేషనల్ హైవే- 65 (హైద్రాబాద్-విజయవాడ) పై అవసరాన్ని బట్టి వాహనాల మళ్లింపు చర్యలు తీసుకుంటున్నామని, పోలీసు సూచనలు పాటించాలని తెలిపినారు. రోడ్డు వెడల్పు, ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున, ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నది ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా గమ్యం చేరాలి. సంక్రాంతి పండగ పూర్తి చేసుకున్న ప్రజలంతా తమ గమ్యస్థానాలకు హైద్రాబాద్కు సురక్షితంగా చేరుకోవాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యం. రద్దీ గమనిస్తూ నిదానంగా వాహనాలు నడపాలి, ఒక క్రమ పద్ధతిలో వెళ్ళాలి, సుదీర్ఘంగా ప్రయాణ చేయకుండా కొద్ది సేపు విరామం తీసుకుంటే మంచిది, నిద్రమత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరం, ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపవద్దు అని ఎస్పి రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం." అని తెలిపారు. డ్రోన్, సీసీటీవీ నిఘాతో ట్రాఫిక్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100 ని సంప్రదించాలని జిల్లా ఎస్పి కోరారు. జాతీయ రహదారి వెంట ఉన్న గ్రామాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఎక్కడపడితే అక్కడ రోడ్లు దాటకూడదని పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని పశువులని రోడ్లపైకి వదల వద్దని కోరారు.



## స్మశాన వాటిక బోరు మోటర్ ప్రారంభం



**విశ్వంభర,** పరిగి : పరిగి మున్సిపాలిటీ పరిధిలోని 10 వార్డులో మున్నూరు వాడ స్మశాన వాటిక, ముదిరాజ్ స్మశాన వాటిక బోరు మోటర్ ను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. స్మశాన వాటిక ల్లో నీటి సదుపాయం కల్పించడం ద్వారా అంత్యక్రియల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ప్రతి వర్గానికి సమాన అవసరమైన సౌకర్యాలు అందించడమే తమ లక్ష్యం అని పేర్కొన్నారు. రెండు కుల సంఘాల స్మశాన వాటికల కు కాంపౌండ్ వాల్ మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ వన్ అధ్యక్షులు సిద్ధాంతి పార్థసారథి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, డిసిసి ఉపాధ్యక్షులు లాల్ కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గానేమోని శ్రీనివాస్, కుడుముల వెంకటేష్, చిన్న నరసింహులు సర్వర్, అక్బర్, రాజా పుల్లారెడ్డి, సుల్తాన్, రహీమ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ ముహూర్తం పిక్స్




**విశ్వంభర, రాప్తాడు :** రాప్తాడు మండల కేంద్రం నందు 18వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు విశ్వవిఖ్యాత, నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ,స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా పేదవాడికి ఐదు రూపాయలకు కడుపు నింపాలన్న ,లక్ష్యంతో రాప్తాడు మండల కేంద్రం నందు అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాప్తాడు శాసనసభ్యులు పరిటాల సునీతమ్మ, ధర్మవరపు నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, రాప్తాడు మండల ఇంచార్జ్ ధర్మవరపు మురళి, విచ్చేయుచున్నారు. కావున నియోజకవర్గంలోనే తెలుగుదేశం పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, సీనియర్ నాయకులు, సర్పంచులు ,ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు మార్కెట్ యార్డ్ చైర్మన్ ,వైస్ చైర్మన్, డైరెక్టర్, సింగల్ విండో చైర్మన్లు ,డైరెక్టర్లు, క్లస్టర్ యూనిట్, బూత్ కన్వీనర్లు, బిఎల్ఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, స్టోర్ డీలర్లు ,మహిళా నాయకులు, గ్రామ కమిటీ సభ్యులు ,కార్యకర్తలు, నందమూరి అభిమానులు, పరిటాల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావలసిందిగా నిర్వాహఅబశ్రీశ్రీకులు విజ్ఞప్తి చేశారు.

## సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**విశ్వంభర,** పరిగి : మండల పరిధిలోని రుకుంపల్లి గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభోత్సవంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలు దేశానికి పట్టుకొమ్మలు గ్రామ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు ఐక్యమత్యంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి పంతులు, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, డిసిసి ఉపాధ్యక్షులు లాలూ కృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయూబ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శశికళ ఆనంద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గానేమోని శ్రీనివాస్, పాలాది శ్రీనివాస్ గుప్తా, అశోక్, చంద్రయ్య, సుల్తాన్, వెంకటేష్, చిన్న నర్సింలు, సర్వర్, రాజ పుల్లారెడ్డి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



# డీఎంకే తో కాదు .. విజయ్ తో కాంగ్రెస్ పొత్తు!



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** దేశంలోని పలు రాష్ట్రాల్లో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహం రూపొందించుకోవడానికి కాంగ్రెస్ హైకమాండ్ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ ముఖ్యంగా తమిళనాడు నేతలతో చర్చలు జరుపుతున్నారు. తమిళనాడులో కాంగ్రెస్ ఎటువంటి వ్యూహాన్ని అనుసరించాలి అనే అంశంపై రెండు రోజులలో స్పష్టత రావడం అవకాశం ఉంది.

తమిళనాడులో కాంగ్రెస్ ఎక్కువ కాలం డీఎంకేతో పొత్తులో ఉంది. అయితే, కొంతమంది కాంగ్రెస్ నేతలు హీరో విజయ్ స్థాపించిన టీవీకేతో కొత్త కూటమి ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. టీవీకేతో పొత్తు ఏర్పడితే డీఎంకేకు కాంగ్రెస్ దూరం అవుతుందా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

సీట్ల సర్దుబాటు, అధికార భాగస్వామ్య వివాదం:

డీఎంకే, కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటు మరియు ప్రభుత్వంలో భాగస్వామ్యంపై వివాదం కొనసాగుతోంది. స్టాలిన్ ప్రభుత్వంలో కాంగ్రెస్‌కు కేవలం మంత్రి పదవులు ఇవ్వకపోవడంపై పార్టీ అసహనాన్ని వ్యక్తం చేసింది. డీఎంకే 19 సీట్లు మాత్రమే ఇవ్వగలదని చెప్పడంతో, కాంగ్రెస్ 35 సీట్ల కోరికతో సర్దుబాటులో అడ్డంకి ఏర్పడింది. గతంలో 2016, 2011, 2006 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్ల కోసం పోటీచేసిన దృష్ట్యా, 2026 ఎన్నికల్లో 35 సీట్లు కోరికగా ఉంది.

టీవీకే వైపు కాంగ్రెస్ ఎందుకు చూస్తోంది?

పార్టీ వర్గాల ప్రకారం, టీవీకేతో పొత్తు ఏర్పాటు చేస్తే 60కి పైగా సీట్లు, అధికార భాగస్వామ్యం లభిస్తుందని భావిస్తున్నారు. అంతే కాకుండా, టీవీకేకు సుమారు 30 శాతం ఓట్ల ఆధారంగా మంచి ప్రభావం ఉంటుందని అంతర్గత సర్వే సూచించింది. విజయ్ ప్రభావం ఇతర దక్షిణాది రాష్ట్రాలకు కూడా విస్తరించిందని, క్రైస్తవ ఓట్ల సమీకరణలో కూడా లాభం కలగబోతోందని కాంగ్రెస్ అంచనా వేసింది.

రాహుల్ గాంధీ మద్దతు:

ఇటీవల హీరో విజయ్ సినిమాకు సంబంధించి వచ్చిన సమస్యలపై రాహుల్ గాంధీ బహిరంగ మద్దతు ఇచ్చారు. అంతకుముందు కరూర్ ఘటనకు సంబంధించిన తర్వాత విజయ్‌ను రాహుల్ ఫోన్ చేసినట్టు తెలిసింది. కొన్ని కాంగ్రెస్ నేతలు టీవీకేతో పొత్తు ప్రయత్నం డీఎంకేపై ఒత్తిడి కోసం మాత్రమే ఉపయోగిస్తున్నారని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పెద్ద సవాలు:

డీఎంకేను వదిలి టీవీకేతో పొత్తు ఏర్పాటు చేయడం కాంగ్రెస్‌కు సులభం కాదు. తమిళనాడులో పార్టీకి సొంత ప్రజాదరణ తక్కువగా ఉండటంతో, జాతీయ రాజకీయాల్లో డీఎంకే కీలక పాత్ర వహిస్తోంది. ఈ పరిస్థితుల్లో హైకమాండ్ డీఎంకేతో చర్చల్లో వెనక్కు తగ్గే అవకాశం ఉన్నా, టీవీకేతో పొత్తుపై నిర్ణయం త్వరలోనే వస్తుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## కాన్సాస్ సెనేట్‌లో కేఏ పాల్ ప్రపంచశాంతికి ప్రార్థనలు..!!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అమెరికాలోని కాన్సాస్ స్టేట్ సెనేట్‌లో ప్రసంగిస్తూ ప్రపంచ యుద్ధాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన చెప్పినట్లుగా, ఈ సమయంలో ప్రపంచవ్యాప్తంగా 58 ప్రధాన యుద్ధాలు కొనసాగుతున్నాయి. వీటి కారణంగా లక్షలాది ప్రాణాలు కోల్పోతున్నారని, వృథా ఖర్చులు ట్రిలియన్ల డాలర్లుగా పెరుగుతున్నాయని పాల్ అభిప్రాయపడ్డారు.

పాల్ ప్రకారం, యుద్ధాలను శాశ్వతంగా నిర్మూలించడమే నిజమైన శాంతికి మార్గం. ఈ నేపథ్యంలో ఆయన ప్రపంచ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ప్రసంగంలో పాల్ భారత్-అమెరికా సంబంధాల బలోపేతంపై కూడా దృష్టి సారించారు. రెండు దేశాలు కలసి ప్రపంచ శాంతి కోసం నాయకత్వం వహించాలని, మానవ హక్కులు, ప్రజాస్వామ్య విలువలను రక్షించడంలో కీలక పాత్ర పోషించగలవని ఆయన గుర్తు చేశారు.ప్రపంచ యుద్ధాల వల్ల కలిగే ప్రాణనష్టం, ఆర్థిక నష్టం, మరియు భవిష్యత్తులో శాంతి సాధనలో రెండు దేశాలకీ ముఖ్య బాధ్యత ఉందని కేఏ పాల్ స్పష్టం చేశారు.

## కస్టడీ అవసరమా? ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టు ప్రశ్న



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావుపై కొనసాగుతున్న దర్యాప్తు తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇప్పటికే రెండు వారాల పాటు కస్టడీకి అనుమతి ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసిన కోర్టు, "ఇంకెంతకాలం ఇంటరాగేషన్ కొనసాగించాలనుకుంటున్నారు? ఈ దర్యాప్తులో ఇంకా ఏమి మిగిలి ఉంది?" అంటూ దర్యాప్తు సంస్థను నేరుగా ప్రశ్నించింది. ప్రభాకర్ రావు విచారణను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించిన న్యాయస్థానం, ప్రభుత్వ ఉద్దేశాలపై కూడా స్పష్టత కోరింది. మీ లక్ష్యం ఇప్పటికే పూర్తయ్యిందా? లేక మళ్లీ ఆయనను జైలుకు పంపాలనుకుంటున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయబడినంత మాత్రాన విచారణకు పిలవకూడదన్న అర్థం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. దర్యాప్తు అవసరమైతే ఆయనను తిరిగి పిలిచి ప్రశ్నించవచ్చని, ప్రభాకర్ రావు దర్యాప్తుకు సహకరిస్తారని కూడా కోర్టు అభిప్రాయపడింది. కేసు పురోగతిని దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ఆధారంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినట్లు ధర్మాసనం వెల్లడించింది. తదుపరి విచారణ జరిగే వరకు ప్రభాకర్ రావుకు మంజూరు చేసిన మధ్యంతర రక్షణను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణను మార్చి 10కు వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు దర్యాప్తు దశలో అధికారుల బాధ్యతలు, కస్టడీ అవసరంపై కీలక సూచనలుగా మారాయని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## పేకాట స్థావరాలపై సీసీఎస్ టీం మెరుపు దాడి



**విశ్వంభర, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఇంచార్జ్ సిసిఎస్ ఎసిపి ఇన్చార్జ్ మస్తాన్ అలీ సూచనల మేరకు ఎస్సై గోవింద్ నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంగాస్థం ఫ్లేస్ 1 సాయిగలరుద్వి అపార్ట్మెంట్ లో పేకాట స్థావరాలపై రెడ్ గా దాడి చేసి ఏడుగురు పేకాటరాయిడ్లను ఏడు సెల్ ఫోన్ లను, నగదు 22,060/ స్వాధీనం చేసుకొని రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## బెట్టింగ్ వెబ్‌సైట్స్ పై నిషేధం

- బెట్టింగ్ మాఫియాపై 'కేంద్రం' దాడి
- ఆన్‌లైన్ గేమింగ్ చట్టం కింద కఠిన చర్యలు
- 7,800 ప్లాట్‌ఫాంలపై నిషేధం

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** దేశంలో చట్టవిరుద్ధంగా కొనసాగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ నెట్‌వర్క్‌లపై కేంద్ర ప్రభుత్వం మరోసారి కొరడా ఝుళిపించింది. కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఆన్‌లైన్ గేమింగ్ చట్టం 2025' నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్న 242 అక్రమ వెబ్‌సైట్లను బ్లాక్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ వెబ్‌సైట్ల లింకులను వెంటనే తొలగించాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను ఆదేశించింది. తాజాగా నిషేధించిన 242 సైట్లతో కలిపి ఇప్పటివరకు మొత్తం 7,800కి పైగా అక్రమ ప్లాట్‌ఫాంలను కేంద్రం మూసివేయించింది.

అక్రమ బెట్టింగ్ యాప్స్ వల్ల యువత ఆర్థికంగా, మానసిక సంఘర్షణకు లోనవుతున్నారని గుర్తించిన ప్రభుత్వం గత ఏడాది కాలంగా విరుచుకుపడుతోంది. మనీ లాండరింగ్, పన్ను ఎగవేతలకు పాల్పడుతున్న ఆఫ్‌షోర్ కంపెనీల వెబ్‌సైట్లను ప్రధానంగా టార్గెట్ చేశారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. "ఆన్‌లైన్ జూదం వల్ల ఎంతోమంది అమాయకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువత ఈ ఉచ్చులో పడకుండా చూసేందుకు ఈ చర్యలు అత్యవసరం. కేవలం సైట్లను బ్లాక్ చేయడమే కాకుండా, వీటిని ప్రచారం చేసే సెలబ్రిటీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటాం" అని స్పష్టం చేశారు.

## టీయూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



**విశ్వంభర, సూర్యాపేట :** ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో విద్యా బోధన చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. తెలంగాణా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2026 సంవత్సరం దైనందినిని సూర్యాపేట జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నందలాల్ పవార్ గారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ తేజస్ నందలాల్ పవార్ గారు మాట్లాడుతూ టీయూటీఎఫ్ సంఘ సభ్యులు సమాజ నిర్దేశకులుగా ఉండాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటుగా,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు వృత్తి నిబద్ధతతో విద్యా బోధన చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర నాయకులు దామెర శ్రీనివాస్,ఊట్కూరి జానకి రాములు,ధరణికోట రవి కుమార్,యర్రంశెట్టి చలమంద రావు,జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు మామిడి అరవిందు,కస్తూరి కిషన్ ప్రసాద్,సూర్యాపేట జిల్లా నాయకులు కటకం నరసింహ స్వామి,నక్కపోతు శ్రీనయ్య,శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లాలో కొత్త అల్లుడికి 150 వంటకాలతో సంక్రాంతి కనుమ విందు

**విశ్వంభర, నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా వర్ని సంక్రాంతి సందర్భంగా ఇంటికి వచ్చిన అల్లుడికి 150 రకాల వంటకాలతో విందు ఇచ్చారు. అయితే లక్ష్మీరాంబాబు దంపతులు తమ కుమార్తెకు రెండు నెలల క్రితమే వివాహం జరిపించారు. సంక్రాంతి పండుగకు తొలిసారి ఇంటికి వచ్చిన అల్లుడి కోసం మంగాదేవితో కలిసి ఏకంగా 150 రకాల తీపి, పిండి వంటలను సిద్ధం చేశారు. పెద్ద అరటి ఆకులో ఈ వంటకాలన్నింటినీ వడ్డించి, కుటుంబ సమేతంగా విందు ఇచ్చారు. ఇది ఇలా ఉండగా నిజమైన సంక్రాంతి పండగ ఆ ఇంట్లో కనిపించింది అని స్థానికులు పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబల విలువలు, అల్లుళ్లకు, బంధువులకు ఇచ్చే గౌరవం ఏంటో వీరిని చూస్తే అర్థమవుతుందని ఆ ఊరి వాళ్ళు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



## సైన్యంలోకి 'స్వదేశీ' రోబో సైనికులు

- నేవీ టెక్నాలజీతో ఆర్మీ బలోపేతం
- 'స్వదేశీ ఎంప్రెసా'తో ఒప్పందం
- త్రివిధ దళాల ఏకీకరణలో మరో కీలక మైలురాయి



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** 'ఆత్మనిర్భర్ భారత్', 'వికసిత్ భారత్ 2047' లక్ష్యాల సాధనలో భాగంగా భారత సైన్యం రక్షణ రంగంలో సరికొత్త సాంకేతికతకు శ్రీకారం చుట్టింది. ప్రమాదకరమైన అగ్నిప్రమాదాల నుంచి సిబ్బందిని రక్షించేందుకు అత్యాధునిక 'ఫైర్ ఫైటింగ్ రోబో' లను కొనుగోలు చేసేందుకు శుక్రవారం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన 'ఐడెక్స్' పథకం కింద ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది.

చారిత్రాత్మక ఒప్పందం

జనవరి 13, 2026న ఢిల్లీలోని క్యాపబిలిటీ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్‌లో ఈ ఒప్పంద ప్రక్రియ ముగిసింది. అహ్మదాబాద్‌కు చెందిన స్టార్టప్ సంస్థ మెస్సర్స్ 'స్వదేశీ ఎంప్రెసా ప్రైవేట్ లిమిటెడ్' ఈ రోబోలను సరఫరా చేయనుంది. భారత సైన్యం, స్టార్టప్ రంగం మధ్య ఉన్న బంధాన్ని ఈ ఒప్పందం మరింత బలోపేతం చేసింది. ఈ రోబోలను తొలుత భారత నౌకాదళం కోసం ఐడెక్స్ ఫ్రేమ్‌వర్క్ కింద అభివృద్ధి చేశారు. నౌకాదళం నిర్వహించిన పరీక్షల్లో ఈ రోబోలు అద్భుత ప్రదర్శన చేశాయి. నేవీ కోసం తయారు చేసిన పరిజ్ఞానాన్ని భారత సైన్యం సద్వినియోగం చేసుకోవడం ఇదే తొలిసారి. ఇది త్రివిధ దళాల మధ్య ఉన్న సమన్వయాన్ని చాటిచెబుతోంది.

భారత సైన్యం కేవలం ఈ రోబోలకే పరిమితం కాకుండా, ఐడెక్స్ ద్వారా ఇప్పటికే డెలివరీ అయిన ప్రాజెక్టులను మెరుగుపరుస్తోంది. ప్రస్తుతం మరో 22 అత్యాధునిక ప్రాజెక్టులు ట్రయల్స్ దశకు చేరుకున్నాయని, భవిష్యత్తులో యుద్ధ రంగంలో రోబోటిక్స్, ఏఐ పాత్ర మరింత పెరగనుందని రక్షణ వర్గాలు వెల్లడించాయి.

## కాకినాడకు భారీ పెట్టుబడులు

- గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌తో 8వేల మందికి ఉపాధి
- తొలిసారిగా విదేశాలకు అమ్మోనియా ఎగుమతి



**విశ్వంభర, ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ మైలురాయి ఆవిష్కృతం కాబోతోంది. ప్రముఖ ఇంధన సంస్థ 'ఏఎం గ్రీన్' కాకినాడలో ఏకంగా 10 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్వయంగా వెల్లడించారు. ఈ ప్లాంట్ ద్వారా ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి కానుంది. ఈ ప్లాంట్ నుంచి దేశంలోనే తొలిసారిగా గ్రీన్ అమ్మోనియాను అంతర్జాతీయ విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నారు.జర్మనీ, సింగపూర్, జపాన్ దేశాలకు ఎగుమతి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో సుమారు 8,000 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

2030 నాటికి ఉత్పత్తి ప్రారంభం


పర్యావరణ హితమైన ఇంధన వనరుల తయారీలో ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ లీడర్‌గా నిలిపేందుకు ఈ ప్లాంట్ దోహదపడనుంది. ఈ ప్రాజెక్టును సత్వరం పట్టాలెక్కించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి లోకేశ్ తెలిపారు. 2030 నాటికి ఏఎం గ్రీన్ సంస్థ ఉత్పత్తిని ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఏపీని పెట్టుబడుల స్వర్గధామంగా మారుస్తాం" అని లోకేశ్ తన పోస్టులో ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని గ్లోబల్ కంపెనీలు రాష్ట్రానికి రానున్నాయని సూచించారు.

## సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ గౌడ్ ఇక లేరు

విశ్వంభర, నెల్లికుదురు : సీనియర్ జర్నలిస్టు మద్దెల శ్రీనివాస్ గౌడ్ గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశాడు. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన మద్దెల శ్రీనివాస్ గౌడ్(45) కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు.చాలా ఆసుపత్రులకు తిరిగినప్పటికీ సమస్య నయం కాలేదు. దీంతో గురువారం సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లి గడ్డి మంది తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఏరియా ఆసుపత్రి మహబూబాబాద్ కు తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం కు తీసుకువెళ్లారు.చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం కన్నుమూశాడు.శ్రీనివాస్ బంధువు యాకయ్య ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా జర్నలిస్టు శ్రీనివాస్ కు భార్య మంజుల,కుమార్తె సాహిత్య, కుమారుడు జీవన్ ఉన్నారు. అందరిని పలకరిస్తూ కలివిడిగా ఉండే జర్నలిస్టు శ్రీనివాస్ అకాల మృతి పట్ల గ్రామంలో మండలంలో విషాదం నెలకొంది.

# ట్రోలర్లపై అనసూయ ఫైర్

- ఒకేసారి 42 మందిపై సైబర్ క్రైమ్ కేసు
- ఒక ఇంటర్వ్యూతో మొదలైన విద్వేష ప్రచారం



**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రముఖ సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియా వేదికగా తనపై జరుగుతున్న అనుచిత దాడులపై చట్టపరమైన పోరాటానికి సిద్ధమయ్యారు. గత కొంతకాలంగా ఆన్‌లైన్ వేదికగా తనను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్న వారిపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక వివరాలను పరిశీలించిన పోలీసులు, ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న సుమారు 42 మందిపై కేసులు నమోదు చేయడం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

గతేడాది డిసెంబర్ 23న ఒక మీడియా ఇంటర్వ్యూలో అనసూయ తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకున్నారు. అయితే, ఆ వ్యాఖ్యలను సాకుగా తీసుకుని సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు, కంటెంట్ క్రియేటర్లు ఆమెపై ఒక క్యాంపెయిన్ తరహాలో దాడికి దిగారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, లైంగిక దూషణలు, బెదిరింపులు, అసభ్యకరమైన పోస్టులతో ఆమెను మానసిక వేదనకు గురి చేశారు. ఇది క్రమంగా ముదిరి క్రిమినల్ డిఫమేషన్, ఏఐ ఫోర్జరీ వంటి తీవ్రమైన నేరాలకు దారితీసిందని అనసూయ పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు.

రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు అనసూయ సమర్పించిన పక్కా ఆధారాలు, సోషల్ మీడియా లింకులను పరిశీలించిన పోలీసులు ఈ కేసును అత్యంత కీలకంగా పరిగణిస్తున్నారు. నిందితుల జాబితాలో సినీ రంగానికి చెందిన కరాటే కల్యాణి, శేఖర్ బాషా, విజయలక్ష్మి వంటి ప్రముఖులతో పాటు టీవీ యాంకర్లు రోహిత్, మనోజ్, పలువురు యూట్యూబ్ ఛానల్ నిర్వాహకులు ఉన్నారు. బొజ్జ సంధ్యారెడ్డి, ప్రియాచౌదరి గోగినేని వంటి సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల పేర్లను కూడా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. కేవలం వ్యక్తులే కాకుండా, తప్పుడు ప్రచారం చేసిన కొన్ని ఆన్‌లైన్ మీడియా పేజీలపై కూడా చర్యలకు ఉపక్రమించారు.

**సాంకేతిక ఆధారాలతో విచారణ వేగవంతం**

ఈ కేసులో ప్రధానంగా 'ఏఐ ఫోర్జరీ' (మార్ఫింగ్), లైంగిక వేధింపుల అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. నిందితులు వాడిన ఐపీ అడ్రస్‌లు, సోషల్ మీడియా అకౌంట్ల వివరాలను సేకరిస్తున్నారు. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలను కించపరుస్తూ వ్యూస్ కోసం కంటెంట్ క్రియేట్ చేసే వారికి ఈ కేసు ఒక హెచ్చరికగా మారుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు. త్వరలోనే నిందితులకు నోటీసులు జారీ చేసి, విచారణకు పిలిచే అవకాశం ఉందని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# కాకలు తీరిన కమ్యునిస్టు యోధుడు జ్యోతిబసు

**జనవరి 17... జ్యోతిబసు వర్ధంతి**



భారత రాజకీయ రంగంలో అగ్రశేణి నాయకుల్లో ఒకరైన జ్యోతిబసు భారత స్వాతంత్ర్యోద్యమంలో, ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తొలితరం నాయకులు, మొదటి పోలిట్ బ్యూరో సభ్యులు. 23 సంవత్సరాలు వరసగా ఒకే రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా పనిచేసిన సుదీర్ఘ పాలనా అనుభవ శాలి. ప్రధాని కావడానికి అవకాశం వచ్చినా, పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ ఆదేశానుసారం దూరంగా నిలిచి క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన నిబద్ధత కలిగిన ఆదర్శ నేత ఆయన.

సీపీఎం కురువృద్ధుడు జ్యోతిబసు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి 23 సంవత్సరాల పాటు విరామం లేకుండా ముఖ్యమంత్రిగా సేవలందించి చరిత్ర సృష్టించారు. పశ్చిమ బెంగాల్‌లో రైతాంగ కార్మికులను సమీకరించి రైతాంగ ఉద్యమాల్లో, పీడిత ప్రజల ఉద్యమాల్లో జ్యోతిబసుది పాత్ర మరువ లేనిది.

దేశంలో గ్రామ పంచాయతీ వ్యవస్థ ను బలోపేతం చేసి భూ సంస్కర ణలు అమలు చేసి కౌలుదారు లకు, కార్మికులకు రక్షణ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంగా బెంగాల్‌ను తీర్చిదిద్దిన పాలనా సంస్కరణ వాది జ్యోతిబసు.

1914 జూలై 8న కోల్‌కత్తాలో బెంగాలీ మధ్య తరగతి కుటుంబం లో జ్యోతి బసు...నిశికాంత్ బసు, హేమలతా బసు దంపతులకు జన్మించారు. స్థానికంగా కలకత్తా (నేటి కోల్‌కత) లోనే జ్యోతి విద్యా భ్యాసం చేశారు. ప్రెసిడెన్సీ కళా శాలలో బసు తన డిగ్రీ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 1935 లో ఇంగ్లాండు వెళ్ళారు. ఇంగ్లాండులో న్యాయ శాస్త్రంలో విద్య నభ్యసించే సమయంలో గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై, రాజకీయాలపై ఆసక్తి పెంచు కున్నారు. 1938లో జవ హర్ లాల్ నెహ్రూ లండన్ పర్యటన సమయంలో సదస్సు నిర్వహణ బాధ్యతను జ్యోతి బసు తీసు కున్నారు సుభాష్ చంద్రబోస్ పర్యటన సమయంలో కూడా జ్యోతి బసు ఏర్పాట్లు చేసారు.

1940లో న్యాయశాస్త్ర విద్య పూర్తి చేసుకొని మిడిల్ టెంపుల్ వద్ద బారిస్టర్‌గా అర్హత సాధించి, అదే సంవత్సరంలో భారత దేశానికి తిరిగి వచ్చారు. 1944లో ట్రేడ్ యూనియన్ ఉద్యమాలలో పాలు పంచుకొని ఆ తరువాత యూని యన్ ప్రధాన కార్యదర్శి అయ్యారు.

1946లో తొలిసారిగా బెంగాల్ శాసనసభకు ఎన్నికయ్యారు. బి.సి. రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో శాసనసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. 1967లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓడిపో వడంతో అజయ్ ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ప్రభుత్వంలో 1967 నుండి 1969 వరకు పశ్చిమ బెంగా ల్ ఉప ముఖ్య మంత్రిగా వ్యవహ రించారు.1972 లో రాష్ట్రంలో మళ్ళీ కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయగా, జ్యోతి బసు కూడా తన శాసనసభ స్థానంలో ఓటమి పాలైనారు. తర్వాత 1977 జూన్ 21 నుండి 2000 నవంబరు 6 వరకు నిరాటంకంగా జ్యోతి బసు వరుసగా 5 సార్లు ముఖ్య మంత్రిగా పని చేశారు. తద్వారా దేశంలో ఒక రాష్ట్రానికి అత్యధిక కాలం పాటు ముఖ్య మంత్రిగా కొనసాగిన రికార్డును కూడా జ్యోతి బసు నెల కొల్పారు. సి.పి.ఐ (ఎం) పోలిట్ బ్యూరో నిర్ణయం వల్ల 1996లో దేశ ప్రధాన మంత్రి అయ్యే అవకాశాన్ని వదులు కున్నారు. 2000లో ముఖ్య మంత్రి పదవి నుండి వైదొలిగిన జ్యోతి బసు జనవరి 17, 2010న 96 సంవత్సరాల వయస్సులో మరణించారు.

# సాహితీ వేత్తలకు స్ఫూర్తి దాయకం... మడిపెల్లి భద్రయ్య రచనా వ్యాసంగం

**○ నేడు మడిపెల్లి భద్రయ్య జయంతి**




మడిపెల్లి భద్రయ్య తెలంగాణ ప్రాంతానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, ఉత్తమ ఉపాధ్యాయుడు, ఆధ్యాత్మిక రచయిత, సమాజ సేవకుడు. ఆయన తన రచనలతో, ఉపాధ్యాయ వృత్తిలోని అంకిత భావంతో, తెలంగాణ ఉద్యమంలో చేసిన విశేష సేవలతో తెలుగు భాషా ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచారు. ఆయన జీవితం, రచనలు, సేవలు తెలుగు భాషాభివృద్ధికి, తెలంగాణ ప్రజాస్వామిక చైతన్యానికి ఒక గొప్ప ఉదాహరణగా నిలుస్తాయి.

మడిపెల్లి భద్రయ్య 1945, జనవరి 17న నిర్మల్ పట్టణంలో మడిపెల్లి వీరయ్య, గంగమ్మ దంపతులకు జన్మించారు. వీరయ్య స్వయంగా ఒక ప్రతిభావంతుడు, వేములవాడ రాజరాజేశ్వరునిపై సీసపద్యాల రూపంలో శతకాన్ని రచించారు. తన తండ్రి నుంచి భద్రయ్య పద్యాల ఆలాపనకు ప్రేరణ పొందారు. చిన్ననాటి నుంచే తెలుగుపై ఆయనకు ఉన్న ఆసక్తి అద్భుతమైనది. విద్యాభ్యాసంలో తెలుగులో ఉన్నత విద్యను అభ్యసించి, 1968లో బి.ఎ. పట్టాను పొందారు.

1963లో లక్షెట్టిపేట పాఠశాలలో ఉపాధ్యాయునిగా తన జీవన ప్రస్థానాన్ని ప్రారంభించారు. తర్వాత భైంసా, దిలావర్‌పూర్, ఇచ్చోడ, ఉట్నూరు, ఆసిఫాబాద్ వంటి ప్రదేశాల్లో పని చేసి, 2001లో కుంటాల ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన అంకితభావం, విద్యార్థుల క్షేమం పట్ల చూపిన శ్రద్ధకు అనేక ప్రశంసలు లభించాయి. భద్రయ్య ఒక సాహితీ వేత్త మాత్రమే కాదు, సమాజానికి మార్గదర్శకులు కూడా. ఆయన రచనలు కేవలం సాహిత్య కళాత్మకతను మాత్రమే కాకుండా, ప్రజలలో చైతన్యం రేకెత్తించే సామర్థ్యాన్ని కలిగించాయి. ఆయన 1300 కంద పద్యాలను ఏకఛందంలో రచించారు. ఆయన రచనలలో దేశభక్తి, ఆధ్యాత్మికత, సామాజిక అంశాలు ప్రాధాన్యత కలిగినవి.

ప్రధాన రచనలలో... శ్రీ షిర్డీ సాయి త్రిశతి, శ్రీ జ్ఞాన సరస్వతీస్తవం, శ్రీ సత్యసాయి స్తుతి, నిరసన గొంతుకలు (తెలంగాణ ఉద్యమ పాటలు), మన ఆదిలాబాద్ (జిల్లా సమగ్ర దర్శిని), శ్రీహరి లీలలు (పద్య. కావ్యం), శ్రీ శివలీలలు (ఏకఛంద చంపూ కావ్యం) మున్నగునవి.

భద్రయ్య తొలి తెలంగాణ ఉద్యమంలో మరియు మలి తెలంగాణ ఉద్యమంలో కూడా ప్రత్యక్షంగా పాల్గొన్నారు. తన రచనల ద్వారా ఉద్యమానికి మద్దతు తెలిపి, ప్రజలలో స్వాతంత్ర్య భావనను పెంపొందించారు. తెలంగాణ సంస్కృతిని, వ్యావహారిక భాషను ప్రపంచానికి తెలియజేయడంలో ఆయన పాత్ర ముఖ్యమైనది.

భద్రయ్య సాహితీ సంస్థలను స్థాపించి ప్రాంతీయ సాహిత్య చైతన్యానికి దోహదపడ్డారు. 'ప్రత్యూష' అనే లిఖిత పత్రికను నడిపి పలు సాంఘిక అంశాలను ప్రజల్లో చర్చనీయాంశాలుగా మార్చారు. నాటక రంగంలో కూడా భద్రయ్య ప్రభావవంతమైన పాత్రలు పోషించారు.

భద్రయ్యకు అనేక పురస్కారాలు లభించాయి...1983: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు,1988: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు,
1997: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు,
2011: తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం,
2015: తెలంగాణ రాష్ట్ర అవతరణ పురస్కారం (ఉత్తమ సాహితీవేత్తగా),
2015: భారత కల్చరల్ అకాడమీ వారి కళాశిరోమణి అవార్డు.

మడిపెల్లి భద్రయ్య ఒక ఉపాధ్యాయుడు, సాహితీవేత్తగా మాత్రమే కాకుండా, ఉద్యమకారుడిగా, ఆధ్యాత్మికవేత్తగా ఎన్నో రంగాలలో తన ప్రతిభను చాటారు. ఆయన జీవిత చరిత్ర తెలంగాణ ప్రజలకే కాకుండా, సమస్త భారతీయులకు స్ఫూర్తిదాయకం.

భద్రయ్య రచనలు, విద్యారంగ సేవలు, ఉద్యమ చరిత్ర సాహిత్య ప్రియులకు చక్కని మార్గదర్శనం. ఆయన సాధించిన విజయాలు, సమాజానికి అందించిన సేవలు తరతరాలకు స్ఫూర్తిగా నిలిచి పోతాయి.

# అలనాటి మేటి నటి శాంత కుమారి

**నేడు శాంత కుమారి వర్ధంతి**

తెలుగు చిత్ర పరిశ్రమ ఆప్యాయంగా 'అమ్మ' అని పిలుచుకునే నటి శాంతకుమారి అత్యంత పాత తరానికి, తొలి టాకీ చిత్రాల కాలానికి చెందిన సినీ నటి.

తెలుగు సినిమా పరిశ్రమలో అలనాటి మేటి కథా నాయకులైన నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి. రామచంద్రన్, శివాజీ గణేశన్ లతో పలు చిత్రాలలో నటించారు. 250 చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించారు.

తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. ఎన్‌టి రామారావు నిర్మించి, దర్శకత్వం వహించిన తల్లా పెళ్ళామా చిత్రంలో ఆమె అమ్మమ్మ పాత్ర పోషించారు.

ఆమె పేరొందిన దర్శకుడు పి.పుల్లయ్య సతీమణి. 1936లో 'శశిరేఖా పరిణయం' సినిమాతో నటజీవితం ప్రారంభించి వందకు పైగా సినిమాల్లో నటించారు.

శాంతకుమారి అసలు పేరు వెల్లాల సుబ్బమ్మ. సుబ్బమ్మ వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు లో మే 17, 1920 సంవత్సరంలో జన్మించారు. తండ్రి వెల్లాల శ్రీనివాసరావుకు కళలు అంటే ఎంతో ఇష్టం. అందుకనే కూతురైన సుబ్బమ్మను మద్రాసులో ఉన్న ప్రొ.పి. సాంబమూర్తి వద్దకు కర్ణాటక సంగీతం, వయొలిన్ నేర్చు కోవటానికి దరఖాస్తు చేయించారు. డి.కె. పట్టమ్మాళ్... సుబ్బమ్మకు సహాధ్యాయిని. పదమూడేళ్ళ వయసులోనే సుబ్బమ్మ కర్ణాటక సంగీతంలో ఉత్తీర్ణురాలయ్యింది. పదిహేనేళ్ల వయసులో వయొలిన్ లో ఉత్తీర్ణురాలైనారు. తరువాత గురువుతో కలసి దక్షిణ భారతదేశం అంతా ఎన్నో కచేరీలు చేశారు. పదహారేళ్ళ వయసులోనే విద్యోదయా స్కూలులో పిల్లలకు సంగీతం నేర్పించే వారు. పదహారేళ్ళ వయసులో ఆలిండియా రేడియో కళాకారిణి. ఆకాశవాణి కోసం సంగీత దర్శకుడు సాలూరు రాజేశ్వర రావుతో కలిసి పాడారు.

సుబ్బమ్మ కచేరి చూసిన దర్శక నిర్మాత పి.వి.దాసు (పినపాల వెంకట దాసు) మాయా బజార్/శశిరేఖ పరిణయం (1936) సినిమాలో శశిరేఖ పాత్రను ఇచ్చారు. కానీ సుబ్బమ్మ సినిమాలలో నటించటానికి ఆమె బామ్మ నిరాకరించడంతో, పి.వి.దాసు, అయన మేకప్ మన్ మంగయ్య ఒప్పించడానికి ఎంతో ప్రయత్నించారు. సుబ్బమ్మను శశిరేఖ వేషంలో చూసిన ఆమె బామ్మ చివరకు ఆమె సినిమాలో నటించడానికి ఒప్పుకొన్నారు. దాసు, సుబ్బమ్మ కొంచెం పాతగా ఉందని పేరును శాంతకుమారిగా మార్చారు. శాంతకుమారిగా మారిన నట గాయక సంచలనం తరువాత సినిమా సారంగధర (1937)లో చిత్రాంగి అనే దుష్టపాత్రను ఎంతో ఉత్సాహ భరితంగా పోషించారు. చిత్ర దర్శకుడైన పి.పుల్లయ్యను ఇష్టపడి పెళ్ళి చేసుకొన్నారు. పెళ్ళి చేసుకొన్న తరువాతకూడ ఆమె నట జీవితం సాఫీగా కొనసాగింది. శాంతకుమారి పి. పుల్లయ్య దంపతులకు రాధ, పద్మ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. పుల్లయ్య, శాంతకుమారి 1979 లో ముత్తైదువా అనే ఏకైక చిత్రంలో భార్య మరియు భర్తగా నటించారు.





శాంత కుమారి సినిమా జీవితం ప్రారంభ దశలో అన్నీ పురాణాలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలలోనే నటించారు. యశోదగా కూడా నటించిన ఆమె కృష్ణుని ముద్దుచేస్తూ "చిరు చిరు నగవులు చిందే తండ్రి" అనే మధురమైన పాటను అద్భుతంగా పాడారు.

శాంతకుమారికి మెదటి సాంఘిక చిత్రం ధర్మపత్ని. ఈ చిత్రంలో భానుమతి, శాంత కుమారి, రాళ్ల బండి కుటుంబరావు, పెద్దాపురం రాజు, బేబీ లక్ష్మి, ఆరణి సత్యనారాయణ మొదలైన వారు నటించారు. హను మంత రావు అనే నటుడు హీరో పాత్ర ధారి. అందులో అక్కినేని నాగేశ్వరరావు పలువురు విద్యార్థులతో కలిసి, విద్యార్థిగా నటించారు. అక్కినేనికి శాంతకుమారికీ మధ్య ఎంతో ఆత్మీయమైన అనుబంధం ఉండేది. అక్కినేనిని ఆమె అప్యాయంగా చిన్న తమ్ముడిని పిలిచినట్లు "అబ్బి" అనే వారు. మాయలోకం సినిమాలో అక్కినేనికి ప్రక్క కథానాయికగా నటించిన శాంతకుమారి, జయభేరి సినిమాలో వదినగా నటించారు, అర్ధాంగి సినిమాలోనైతే సవతి తల్లిగా నటించారు. ఎన్.టీ.ఆర్ కు కూడా తల్లా పెళ్ళామా సినిమాలో బామ్మగా నటించారు. తెలుగు సినీ పరిశ్రమలో అగ్రతారలైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, తమిళ సినీ ప్రముఖులు శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ తదితరులకు చాలా చిత్రాల్లో శాంతకుమారి తల్లిగా నటించారు.


పద్మశ్రీ పిక్చర్స్, రాగిణి పిక్చర్స్ పేరుతో సొంతంగా ఇరవైకి పైగా సినిమాలను నిర్మించారు. తాను హీరోయిన్‌గా ప్రధాన పాత్రల్లో నటించిన సినిమాలనే మళ్లీ తీసినపుడు తల్లి పాత్రల్లో నటించిన అరుదైన రికార్డు శాంతకుమారి సొంతం. తమ కుమార్తె పద్మ పేరు మీద పద్మశ్రీ పిక్చర్స్ పేరును వారి కొన్ని సినిమాలకు ఉపయోగించారు. జయభేరి (1959), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), మరియు ప్రేమించి చుడు (1965) వంటి చిత్రాలతో విజయం సాధించారు. శంకరు (1950), అర్ధంగి (1955), శ్రీ వెంకటేశ్వర మహాత్యం (1960), శాంతి నివాసం (1960), రాముడు భీముడు (1964) సహా తన భర్త నిర్మించిన చాలా సినిమాల్లో సంతకుమారి నటించారు. పద్మశ్రీ మరియు రాగిణి బ్యానర్‌లలో వారు 22 సినిమాలు చేశారు. ఆమె సుమారు 250 చిత్రాలలో నటించారు. కృష్ణ ప్రేమ, రేచుక్క, అర్ధంగి 'జయభేరి, ప్రేమ్‌నగర్' ఆమెకు పేరు తెచ్చిన సినిమాలు. సినిమాలలో నటించడం మానేసిన తరువాత ఆమె మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడే పాటలను వ్రాసి, స్వరపరిచే వారు.

మాయాబజార్ లేదా శశిరేఖా పరిణయం (1936), సారంగధర (1937), రుక్మిణీ కల్యాణం (1937),
భక్త జయదేవ (1938), శ్రీ వేంకటేశ్వర మహత్యం (1939), ధర్మపత్ని (1941), పార్వతీ కల్యాణం (1941), కృష్ణప్రేమ (1943) (రాధ పాత్ర), మాయా లోకం (1945), గుణసుందరి కథ (1949) (గుణసుందరి దేవి దుష్టబుద్ధిగల అక్కగా), షావుకారు (1950), ధర్మదేవత (1952) (కాత్యాయిని పాత్ర), అర్ధాంగి (1955), సారంగధర (1957),
జయభేరి (1959) (అన్నపూర్ణ పాత్ర), శ్రీ వెంకటేశ్వర మహత్యం (1960) (వకుళ పాత్ర), సిరి సంపదలు (1962), ప్రేమించి చూడు (1965), ప్రాణమిత్రులు (1967), బంగారు పిచ్చుక (1968),
అక్కాచెల్లెలు (1970) (జడ్జి రామచంద్రరావు తల్లి), ప్రేమనగర్ (1971), కొడుకు కోడలు (1972), సోగ్గాడు (1975), అందరూ బాగుండాలి (1976) తదితర చిత్రాలలో నటించారు.

1999వ సంవత్సరానికి గాను ఆమె 'రఘుపతి వెంకయ్య అవార్డు'ను అందుకున్నారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా సినీ కళాకారులకు ఇచ్చే 'కళా నీరాజన' పురస్కారాన్ని కూడా ఆమె పొందారు.

తెలుగు వెండి తెర బామ్మ
86 సంవత్సరాల వయస్సులో, సుదీర్ఘ అనారోగ్యంతో జనవరి 17, 2006న స్వగృహంలో మృతి చెందారు.

# త్రి భాషల్లో తొలి టాకీ చిత్రాల్లో నటించిన ఎల్.వి.ప్రసాద్



భారతీయ సినిమాకి నడకలు నేర్పిన సినీ పరిశ్రమ ప్రజ్ఞాశాలి, తెలుగు సినిమాకు క్లాసిక్ అనదగ్గ సినిమాలు అందించిన దర్శకుడు ఆయన. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, నటుడుగా సినీ నిఘంటువు లో తనకంటూ కొన్ని పేజిలు సృష్టిం చుకున్న ఉద్దండుడు. మొట్ట మొదటి హిందీ టాకీ చిత్రం 'ఆలం అరా'తో పాటు తమిళ 'కాళిదాస్', తెలుగులో 'భక్త ప్రహ్లాద' వంటి మూడు భాషల్లో తెరకెక్కిన తొలి టాకీ సినిమాల్లో నటించిన ఘనత ఎల్ .వి ప్రసాద్ సొంతం. దర్శకుడిగా 1949లో వచ్చిన 'మన దేశం' సినిమాతో ఎన్టీ ఆర్‌ను, ఆయ నతో పాటు షావుకారు జానకి, సావిత్రి లాంటి గొప్ప నటులను వెండి తెరకు పరిచయం చేసిన ఘనత వహించిన గొప్ప వ్యక్తి ఆయన. ఇంతకీ ఆయన ఎవరో తెలుసా!?

భారతీయ సినీ రంగానికి ఎనలేని సేవలందించి నందుకు గాను దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును అందు కున్న ఎల్. వి.ప్రసాద్.

ఎల్.వి.ప్రసాద్ గా ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవరప్రసాద రావు తెలుగు సినీనిర్మాత, దర్శకుడు, నటుడు. ఎల్. వి. ప్రసాద్ చలన చిత్రరంగానికి ఎనలేని సేవ చేశారు. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలయిన ఆలం ఆరా, కాళిదాస్ మరియూ భక్త ప్రహ్లాద మూడింటిలోనూ ఆయన నటించారు. తెలుగు వారిలో ఆయన ఒక్కరే ఈ ఘనత సాధిం చారు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ వంటి పలు భారతీయ భాషలలో 50 చిత్రాల వరకు ఆయన దర్శకత్వం వహించటం గానీ, నిర్మించటంగానీ, నటించటం గానీ చేసారు. ఎల్.వి.ప్రసాద్ దర్శకత్వంలో పల్నాటి యుద్ధం', 'ద్రోహి', 'సంసారం', 'మిస్సమ్మ', 'అప్పు చేసి పప్పు కూడు' తదితర ఆణి ముత్యాల లాంటి సినిమాలు అందించారు.

ఆయన జనవరి 17,1908 లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఏలూరు తాలూకాలోని సోమవరప్పాడు గ్రామంలో అక్కినేని శ్రీరాములు, బసవమ్మ దంపతుల రెండవ సంతానముగా జన్మించారు. రైతు కుటుంబంలో పుట్టిన ప్రసాద్ గారా బంగా పెరిగారు. చురుకైన వారే అయినా చదువులో ఎప్పుడూ శ్రద్ధ చూపలేదు. ఉరూరా తిరిగే నాటకాల కంపెనీలు, డాన్సు ట్రూపుల డప్పుల చప్పుల్లు ప్రసాద్ ను ఆకర్షించేవి. పాత అరిగి పోయిన సినిమా రీళ్ళను ప్రదర్శించే గుడా రపు ప్రదర్శన శాలల్లో ప్రసాద్ తర చూ వాటిని ఆసక్తిగా చూసేవారు. స్థానిక నాటకాల్లో తరచుగా చిన్న చిన్న వేషాలు వేసేవాతు. ఇదే ఆసక్తి పెద్దయ్యాక కదిలే బొమ్మలు, నటన పై ఆసక్తిని పెంచి సినిమా రంగంలో ప్రవేశించడానికి పునాదులు వేసింది.

1908 జనవరి 17న జన్మించిన ఎల్.వి.ప్రసాద్ వివాహం సౌందర్య మనోహరమ్మతో జరిగింది. ఒకరోజు ఆయన సినిమాల్లో నటించాలనే కోరికతో జేబులో 100రూ.లతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి ముంబయికి వెళ్లిన ఆయనకు ఎంతో కష్టపడగా చివరికి "ఆలం అరా" చిత్రంలో నటించే అవకాశం వచ్చింది. ఆ చిత్రందేశంలోనే తొలి టాకీ సినిమా. అందులో ఎల్.వి. ప్రసాద్ ఓ పాత్ర చేశారు. ఈ చిత్రంలో నటించినందుకు గాను ఎల్.వి.ప్రసాద్‌కు నెలకు 30 రూపాయలను అంద జేశారు. ముంబై వీనస్ ఫిల్మ్ కంపెనీలో చిన్నచిన్న పనులు చేసే సహాయ కుడుగా జీవితాన్ని ప్రారంభించిన ప్రసాద్, శబ్ద చిత్రం "స్టార్ ఆఫ్ ది ఈస్ట్"లో చిన్న పాత్ర పోషించారు. ఆ తర్వాత హెచ్.ఎం.రెడ్డి దర్శ కత్వంలో రూపుదిద్దుకున్న తమిళ చిత్రం కాళిదాస, తెలుగు చిత్రం భక్త ప్రహ్లాదలో ఆయన నటించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగిన ఎల్.వి.ప్రసాద్ 1950లో విడుదలైన విజయ పిక్చర్స్ వారి "షావుకారు" సినిమాకు "దర్శకత్వం" వహించి పేరు తెచ్చుకున్నారు. ఎన్టీ రామా రావు, జానకి నటిచిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ప్రసాద్ ప్రొడక్షన్‌ను నెలకొల్పిన ఎల్.వి. ప్రసాద్ హిందీలో మిలన్, ఖిలోనా, ససురాల్, ఏక్ దూజే కె లియే వంటి సూపర్ హిట్ చిత్రాలను నిర్మించి ఎంతో పాపులారిటీ సంపాదించారు.

1931లో ఆలం ఆరా మొదటి హిందీ టాకీ సినిమా, 1931లో కాళిదాస్ మొదటి తమిళ టాకీ సినిమా, 1931లో భక్తప్రహ్లాద మొదటి తెలుగు టాకీ సినిమా, 1933 లో సీతా స్వయంవర్ (హిందీ), 1940లో బోండాం పెళ్ళి (తెలుగు), 1940లో చదువుకున్న భార్య, 1982లో రాజా పార్వాయి (తమిళం), చిత్రాలలో ఆయన నటించారు. మిస్సమ్మ (1955), గృహ ప్రవేశం (1947), పల్నాటి యుద్ధం (1947),
ద్రోహి (1948), మన దేశం (1949), సంసారం (1950), షావుకారు (1950) చిత్రాలకు దర్శకత్వం వహించారు.

జూన్ 22 1994లో ఈ లోకాన్ని వీడి వెళ్లినా, తన చిత్రాలతో ప్రేక్షకుల మదిలో కొలువై ఉన్నారు. వరల్డ్‌లోనే బెస్ట్ ఐ హాస్పిటల్‌గా ఎంతో పేరు తెచ్చుకున్న ఆయన నెలకొల్పిన 'ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్' దేశంలోనే అత్యున్నత నేత్ర చికిత్సాలయంగా పేరొందింది. ఆయన వారసులు దేశంలోనే అతి పెద్ద ఐమాక్స్ థియేటర్‌ను భాగ్య నగరంలో నిలిపారు...

ఎల్వీ ప్రసాదు స్మారకార్థం భారత తపాలా శాఖ 2006 సెప్టెంబరు 5న ప్రత్యేక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

## హాస్యం చుట్టూ తిరిగిన కథ
# అనగనగా ఒకరాజు

### సంక్రాంతికి నవ్వులు పండించిన నవీన్ పొలిశెట్టి



టాకీస్: నేటి యువ కథానాయకుల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఈ సంక్రాంతికి అలాంటి వినోదాన్ని పంచడానికి 'అనగనగా ఒకరాజు'అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడే రాజు (నవీన్ పొలిశెట్టి). వారసత్వంగా జమీందార్ మనవడు అనే పేరు తప్ప, తాత సంపాదించిన ఆస్తులేమీ మిగలకపోవడంతో ఆర్థిక కష్టాలతో సతమతమవుతూ, పగటి కలలు కంటూ గడుపుతుంటాడు. బాగా డబ్బున్న కుటుంబానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటే జీవితంలో స్థిరపడిపోవచ్చనే నిర్ణయానికొస్తాడు. చారులత (మీనాక్షి చౌదరి)ని చూశాక ఆమే తన రాణి అయితే కష్టాలన్నీ గట్టెక్కేయొచ్చని భావించి, ఆమె మనసుని గెలుచుకోవాలని రంగంలోకి దిగుతాడు. మరి చారులత మనసుని ఎలా గెలిచాడు?ఆమె జీవితంలోకి వచ్చాక రాజు కష్టాలు తొలగిపోయాయా? రాజు రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సిన అవసరం ఎందుకొచ్చింది? తదితర విషయాల్ని తెరపై హృద్యంగా చిత్రీకరించారు. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఒక పల్లెటూరి కథ ఇది. కథ, కథనం, పాత్రలు... ఇలా ప్రతిదీ ఇదివరకటి సినిమాల్లో చూసిన అనుభూతినే కలిగిస్తాయి. అయినా సరే, రాజు పాత్ర చేసే హంగామా నవ్విస్తుంది. కథానాయకుడు నవీన్ పొలిశెట్టి తన మార్క్ టైమింగ్‌ని ప్రదర్శిస్తూ, వన్ మేన్ షోలా సినిమాని ముందుకు నడిపించాడు. సంభాషణలు ఈ సినిమాకి ప్రధానబలం. తన దగ్గరికి సాయం కోసం వచ్చే జనాల కష్టాల్ని వింటూ రాజు పడే అగచాట్లతో సినిమా ముందుకు సాగుతుంది. ఆ సన్నివేశాలన్నీ సాదాసీదాగా అనిపిస్తాయి. పెళ్లిలో శపథం, డబ్బున్న అమ్మాయిల కోసం రాజు చేసే ప్రయత్నాలు, ఆపరేషన్ చారులత ఎపిసోడ్స్ మొదలయ్యాకే అసలు సినిమా మొదలవుతుంది. భీమవరం బాల్మ, రాజుగారి పెళ్లిరో పాటలు సినిమాకి మరింత ఊపుని తీసుకొస్తాయి. ఆ రెండు పాటల చిత్రీకరణ కూడా ఆకట్టుకుంటుంది. చారులత మనసుని గెలిచేందుకు రాజు తన గ్యాంగ్‌తో కలిసి చేసే విన్యాసాలు బాగా నవ్విస్తాయి. విరామ సన్నివేశాలకు ముందు కథలో మలుపు ఆకట్టుకుంటుంది. ద్వితీయార్థంలో కథ పూర్తిగా ఓ కొత్త మలుపుని తీసుకుంటూ, గ్రామ రాజకీయాల నేపథ్యాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రథమార్థంలో రాజు డబ్బు కోసం పెద్దింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించినట్టే, ద్వితీయార్థం కథలోనూ రాజు ఓ ఎత్తుగడ వేస్తాడు. అదే ఈ సినిమాకి కీలకం. ఎన్నికల ప్రచారం, ఊరి జనాన్ని నమ్మించేందుకు కథానాయకుడు పడే అగచాట్ల నేపథ్యం బాగా నవ్విస్తుంది. హీరో స్నేహితులు ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ, అది చూసి ఊరి జనాల ప్రతిస్పందన ఇలా సందర్భోచితంగా మంచి హాస్యం పండుతుంది. సోషల్ మీడియా క్యాంపెయిన్, ఎన్నికల హంగామా సాధారణంగానే అనిపించినా, పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. భార్యాభర్తల మధ్య సంభాషణలు ఒకింత సెంటిమెంట్‌ని పండిస్తాయి. కథ, కథనాల విషయంలో అంచనాలేమీ పెట్టుకోకుండా, సరదాగా కాలక్షేపాన్ని ఆశించి వెళ్లిన ప్రేక్షకులకు తప్పకుండా సంతృప్తినిస్తుందీ చిత్రం. నవీన్ పొలిశెట్టి వన్ మేన్ షోలా ఉంటుంది ఈ సినిమా. ప్రతీ సన్నివేశంలోనూ తెరపై కనిపిస్తూ, నాన్ స్టాప్‌గా సంభాషణలు చెబుతూ అల్లరి చేస్తుంటాడు. చారులత పాత్రలో మీనాక్షి చౌదరి ఆకట్టుకుంటుంది. ఆమెకి ఇందులో ప్రాధాన్యమున్న పాత్రే దక్కింది. ముఖ్యంగా ద్వితీయార్థంలో
ఎక్కువ సన్నివేశాల్లో కనిపించింది. హీరో గ్యాంగ్‌లో కనిపించే చమ్మక్ చంద్ర, మహేశ్, బుల్లిరాజుగా సుపరిచితమైన మాస్టర్ రేవంత్ అక్కడక్కడా నవ్వించారు. రావు రమేశ్ పాత్ర ఆకట్టుకుంటుంది. ప్రథమార్థంలో ఓ కొత్త చిట్టి కనిపించి ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేసింది. మిక్కీ జె.మేయర్ పాటలు, నేపథ్య సంగీతంతో సినిమాపై గట్టి ప్రభావమే చూపించారు. కథ, కథనాల కంటే సంభాషణల రచనే ఈ సినిమాకి ప్రధానబలం. బలమైన కథ లేదనే విషయం బయట పడకుండా, హాస్యం పండించేందుకు రచయితలు ప్రయత్నించారు.

## మన శంకరవరప్రసాద్
# కలెక్షన్ల దూకుడు

### రెండ్రోజులకే వందకోట్ల క్లబ్‌లో చేరిక
### కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్న దర్శకుడు



టాకీస్: ఈ పండగకు అగ్ర హీరో చిరంజీవి శంకరవరప్రసాద్‌గా సందడి చేస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' జనవరి 12న ప్రేక్షకుల ముందుకువచ్చి ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తోంది. మొదటిరోజు రూ.84 కోట్లు వసూలు చేసిన ఈ సినిమా రెండో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద దూకుడు కొనసాగించింది. తాజాగా దీని రెండు రోజుల కలెక్షన్లను నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా 48 గంటల్లో రూ.120 కోట్లు వసూలు చేసినట్లు తెలుపుతూ పోస్టర్ విడుదల చేసింది. ఈ సినిమా వంద కోట్లు దాటడంపై అనిల్ రావిపూడి ఆనందం వ్యక్తంచేశారు. వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన తన ఆరో చిత్రమిదని పేర్కొన్నారు. అసలు సంక్రాంతి ఇప్పటినుంచి మొదలవుతుందని అందరూ ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూసి ఆనందించాలని కోరారు. తనకు ఇంతకుమించిన సంక్రాంతి గిఫ్ట్ మరొకటి ఉండదన్నారు. ఇక ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మై షోలో గంటకు 24 వేల టికెట్స్ అమ్ముడవుతున్నాయని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఈ పండగకు బ్లాక్‌బస్టర్ హిట్ సొంతం చేసుకున్న చిత్రమిదని ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. 'మన శంకరవరప్రసాద్ గారు' విజయం సాధించడంతో చిత్రబృందం తాజాగా సక్సెస్ మీట్ నిర్వహించింది. 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేసినట్లు అనిల్‌రావిపూడి తెలిపారు. ఛాలెంజ్‌గా తీసుకుని సినిమాను పూర్తి చేసినట్లు చెప్పారు. ఇక తన అంచనా ప్రకారం ఈ చిత్రానికి రూ.400 నుంచి 500 కోట్లు వస్తాయని నిర్మాత సాహు గారపాటి తెలిపారు. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ అతిథి పాత్రలో సందడి చేశారు. 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకుంది. దీంతో చిత్రబృందం తాజాగా సెలబ్రేషన్స్ చేసుకుంది. దర్శకనిర్మాతలతో పాటు చిరంజీవి, వెంకటేశ్, రామ్ చరణ్ ఆ సెలబ్రేషన్స్‌లో పాల్గొని కేక్ కట్ సందడి చేశారు.



# నేనెందుకు క్షమాపణలు చెప్పాలి

## మలైకా అరోరా

టాకీస్: ఐటమ్ సాంగ్స్‌తోనే ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు నటి మలైకా అరోరా. ఆమె చేసిన కొన్ని పాటలు సినిమాకే హైలైట్‌గా నిలిచాయి. గతేడాది కూడా రెండు పాటల్లో మలైకా మెరిశారు. కొందరు ఆమెను ఈ విషయంలో ట్రోల్ చేయగా.. తాజాగా ఆమె స్పందించారు. ఆ పాటల వల్ల తనకు శక్తి వస్తుందని తెలిపారు. తాను చేసిన ఐటమ్ సాంగ్స్ విషయంలో ఎవరికీ క్షమాపణలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.

'నేను డ్యాన్స్ చేయడం ఎందుకు తగ్గించాలి. ఆ విషయంలో క్షమాపణలు ఎందుకు చెప్పాలి. ట్రోల్స్ ఎప్పుడూ వస్తూనే ఉంటాయి. డ్యాన్స్ చేయడం గొప్ప విషయం. అదో కళ. నిజమైన గౌరవంతో దాన్ని ఆస్వాదించాలి. 52 ఏళ్ల వయసులో నేను ఇలాంటి పాటల్లో హుషారుగా డ్యాన్స్ చేయగలుగుతున్నానంటే అది నా అదృష్టం. నేను సరైన మార్గంలోనే ప్రయాణిస్తున్నాను. ఇలాంటి పాటలతో అలరించడం నాకు చాలా శక్తినిస్తుంది. నన్ను చూసి మరికొందరు మహిళలు ఇలా హుషారుగా ఉంటే నాకు దానికి మించిన ఆనందం మరొకటి ఉండదు' అని మలైకా అన్నారు. 'ఛల్ ఛయ్య ఛయ్య ఛయ్య'.. 'మున్నీ బద్నామ్ హుయీ'.. నుంచి 'అనార్కలీ డిస్కో చాలి' వరకూ ఎన్నో పాటల్లో మలైకా తన కిర్రాక్ డ్యాన్స్‌తో అభిమానులను అలరించారు. గతేడాది కూడా హనీ సింగ్‌తో కలిసి 'చిల్‌గమ్', ఆదిత్య సర్పోదర్ దర్శకత్వంలో వచ్చిన 'థామా'లో రష్మికతో కలిసి పాయిజన్ బేబీతో ఆకట్టుకున్నారు.

# 'బాహుబలి 2' రికార్డు బద్దలు..

### నార్త్ అమెరికాలో 'ధురంధర్' సరికొత్త చరిత్ర!

టాకీస్: బాలీవుడ్ సినిమా ధురంధర్ విడుదలై నెల దాటుతున్న ఇంకా హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రూ.1300 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం తాజాగా మరో రికార్డును అందుకుంది. గత 9 ఏండ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న ఎస్.ఎస్. రాజమౌళి 'బాహుబలి 2' రికార్డును ధురంధర్ తాజాగా అధిగమించింది. నార్త్ అమెరికాలో ఇప్పటివరకు అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 20.7 మిలియన్ డాలర్లతో 'బాహుబలి 2' అగ్రస్థానంలో ఉండగా.. ఇప్పుడు 'ధురంధర్' 21 మిలియన్ డాలర్ల మార్కును దాటి అగ్రపీఠాన్ని కైవసం చేసుకుంది. ఈ క్రమంలో కల్కి 2898 ఏడీ, పఠాన్, జవాన్ వంటి భారీ చిత్రాలను ఇది వెనక్కి నెట్టింది.




ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సినిమాల సందడి నెలకొన్నప్పటికీ, ఉత్తరాదిలో ఈ సినిమా ప్రభంజనం ఏమాత్రం తగ్గలేదు. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఇప్పటివరకు రూ. 863 కోట్ల నెట్ వసూళ్లు రాబట్టినట్లు ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఐదు రోజుల్లోనే దాదాపు రూ. 22 కోట్లకు పైగా వసూళ్లు రావడం ఈ సినిమా సత్తాను చాటుతోంది.

# ఓటీటీలోకి వచ్చేసిన 'దండోరా'..



టాకీస్: తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం నేటి నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు.

## పీపుల్ మీడియా ఫ్యాక్టరీ విశ్వప్రసాద్‌తో పవన్ భేటీ

### తదుపరి ప్రాజెక్ట్ కోసమే అని ఊహాగానాలు



టాకీస్: సంక్రాంతి పండుగ వేళ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ అందింది. భోగి పండుగ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని, సరికొత్త ఆరంభాలకు నాంది పలుకుతూ పవన్ కళ్యాణ్ తన భవిష్యత్తు చిత్రాలపై దృష్టి సారించినట్లు సమాచారం. ఇందులో భాగంగానే ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీ.జి. విశ్వప్రసాద్‌తో పవన్ కళ్యాణ్ ఈరోజు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గతంలో వీరి మధ్య జరిగిన ప్రాథమిక చర్చలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాబోయే భారీ ప్రాజెక్టుల గురించి ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' భాగస్వామ్యంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోయే చిత్రాలకు సంబంధించి ఈ చర్చలు జరిగినట్లు సమాచారం. రాజకీయ బాధ్యతలతో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, తన కోసం ఎదురుచూస్తున్న నిర్మాతలు, అభిమానుల కోసం తన సినీ కమిట్‌మెంట్లను వేగవంతం చేయాలని పవన్ భావిస్తున్నారు. ఈ భేటీతో పవన్ కళ్యాణ్ నెక్స్ట్ లైన్-అప్‌పై స్పష్టత రావడంతో మెగా ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com